## నీలగిరి నిత్యపద్యం

పొడుపు పద్యం
ఆటవెలది

జీవితానుగాదు జీవరాశులఁబట్టు
నడిచిపోదు దాని నరుడు మోయు
కాయమంత కనులు కాడుదేవేంద్రుడు
తెలుసుకున్నవారు తెలివిపరులు
(జవాబు :-వల)

మీ
విజయప్రసాద్ నలుమాసు



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



## విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 219 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 21-11-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00


## బీహార్ సీఎంగా నితీశ్ ప్రమాణం

- 27మంది మంత్రులు కూడా ప్రమాణం
- ప్రమాణం చేయించిన గవర్నర్
- హాజరైన మోడీ, అమిత్ షా, చంద్రబాబు



**పాట్నా**
బిహార్ సీఎంగా జేడీయూ అధినేత నితీశ్ కుమార్ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. సిఎంగా ఆయన ప్రమాణస్వీకారం చేయడం ఇది పదోసారి. పట్నాలోని గాంధీ మైదానంలో నితీశ్‌తో పాటు 27 మంది మంత్రులు ప్రమాణస్వీకారం చేయగా.. సామ్రాట్ చౌదరీ, విజయ్ కుమార్ సిన్హాలకు డిప్యూటీ సీఎం పదవులు దక్కాయి. గవర్నర్ అరీఫ్ మహ్మద్ ఖాన్ సిఎం, మంత్రులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తదితరులు హాజరయ్యారు.

-మిగతా 2 లో

## గవర్నర్లు, రాష్ట్రపతికి గడవు విధించలేం

- గవర్నర్లకు మూడు అంశాల్లోనే నిర్ణయం
- సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక తీర్పు



**న్యూఢిల్లీ,**
గవర్నర్,రాష్ట్రపతి అధికారాలపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. పెండింగ్ బిల్లుల ఆమోదానికి సంబంధించిన అంశంలో రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును విధించటం తగదని స్పష్టం చేసింది. కారణం చెప్పకుండా గవర్నర్‌లు బిల్లులను వెనక్కి పంపలేరని తెలిపింది. బిల్లును నిరవధికంగా నిలిపివేసే అధికారం గవర్నర్‌కు లేదని కూడా తేల్చి చెప్పింది. గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి పంపితేనే రాష్ట్రపతి చర్యలు తీసుకోగలరని చెప్పింది. ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్‌కు విచక్షణాధికారం ఉందని వెల్లడించింది. తన ముందుకు వచ్చిన బిల్లులను గవర్నర్ రాష్ట్రపతికి పంపడం, అభిప్రాయాలతో తిరిగి పంపడం, బిల్లును పరిశీలించి సూచనలు ఇవ్వడం వంటివి మాత్రమే చేస్తారని

-మిగతా 2 లో



## ఫిరాయింపు ఎమ్మెల్యేపై విచారణ

- పోచారం, అరికెపూడిలతో ముగింపు
- దానం, కడియంలకు మరోమారు నోటీసులు

**హైదరాబాద్, నవంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):** సుప్రీం మరో నాలుగు వారాల గడువు ఇవ్వడంతో పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేలకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ నోటీసులు జారీ చేశారు. గురువారం పోచారం శ్రీనివాసరెడ్డి, అరికెపూడి గాంధీలను విచారించారు. పదిమందిలో ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రం ఇప్పటి వరకు అఫిడవిట్‌లు దాఖలు చేయని పరిస్థితి. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి.. స్పీకర్ నోటీసులకు స్పందించని విషయం తెలిసిందే. దీంతో వారిరువురికి స్పీకర్ మరోసారి నోటీసులు జారీ చేశారు. అనర్హత పిటిషన్లపై అఫిడవిట్ దాఖలు చేయాలని అసెంబ్లీ స్పీకర్ స్పష్టం చేశారు. ఇక.. పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు

-మిగతా 2 లో

## సన్న బియ్యం పంపిణీ పథకం

# విజయవంతం

### దేశమంతా సన్నబియ్యం ఇవ్వండి

- కేంద్రమంత్రికి సీఎం రేవంత్‌రెడ్డి సలహా
- రాష్ట్రంలో ఈ పథకం సక్సెస్ అయ్యిందని వెల్లడి
- దీనివల్ల బియ్యం మార్కెట్ ధరలు స్థిరపడ్డాయని వివరణ
- సీఎం విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి





**హైదరాబాద్ నవంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణలో అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీ పథకం విజయవంతమైందనీ, దీన్ని దేశమంతా విస్తరింపచేయాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషికి సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో రేషన్ షాపుల ద్వారా పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామనీ, దీనివల్ల పీడీఎస్ బియ్యం రీ సైక్లింగ్ తగ్గి, బహిరంగ మార్కెట్లో ధరలు స్థిరపడ్డాయని వివరించారు. ప్రజలు తినే బియ్యాన్ని పంపిణీ చేయటంతో ఈ పథకం ఆశించిన లక్ష్యం నెరవేరిందని చెప్పారు. దీనిపై కేంద్రంమంత్రి ప్రహ్లాద్‌జోషీ స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీపై పూర్తిస్థాయి అధ్యయనం చేసి దేశవ్యాప్తంగా ఈ

-మిగతా 2 లో



## నేడు హైదరాబాద్‌కు రాష్ట్రపతి రాక

- రేపు తిరిగి పుట్టపర్తికి ముర్ము ప్రయాణం

**హైదరాబాద్,- నవంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):** తిరుమల పర్యటన ముగించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం మధ్యాహ్నం 1.10 గంటలకు ప్రత్యేక విమానంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా ఆమె రాజ్ భవన్‌కు వెళ్తారు. మధ్యాహ్నం భోజనం చేసి.. రాజ్ భవన్‌లో విశ్రాంతి తీసుకుంటారు. ఆ తర్వాత 3:50 గంటలకు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి ఆమె చేరుకుంటారు. సాయంత్రం 4.00 గంటలకు రాష్ట్రపతి నిలయం వేదికగా నిర్వహించే భారతీయ కళా మహోత్సవాన్ని రాష్ట్రపతి ముర్ము ప్రారంభిస్తారు. తిరిగి సాయంత్రం 6:15 గంటలకు ఆమె తిరిగి రాజ్ భవన్‌కు

-మిగతా 2 లో

## ట్రంప్ సర్కార్ పచ్చజెండా



- భారత్‌కు రూ.824 కోట్ల విలువైన అమెరికా ఆయుధాలు
- జావెలిన్ క్షిపణులు సహా పలు ఆయుధాల విక్రయానికి ఆమోదం

**న్యూయార్క్**
భారత్‌కు రక్షణ ఎగుమతులపై అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. ఎఫ్‌జీఎం -148 జావెలిన్ యాంటీ-ట్యాంక్ గైడెడ్ మిస్సైల్ సిస్టమ్‌తో పాటు ఎం982ఏ1 ఎక్స్‌క్యాలిబర్ ప్రెసిషన్ గైడెడ్ ఆర్టిలరీ ప్రొజెక్టైల్స్, వాటి అనుబంధ సామగ్రిని భారత్‌కు అగ్రరాజ్యం విక్రయించనుంది. దాదాపు రూ.824 కోట్ల (93 మిలియన్ డాలర్లు) విలువైన ఈ భారీ డీల్‌కు డోనాల్డ్ ట్రంప్ సర్కార్ పచ్చజెండా ఊపింది. దీనిపై అమెరికాకు చెందిన డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ (డీఎస్‌సీఏ) ఓ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. భారత్‌కు అందించనున్న ఆయుధ సామగ్రి జాబితాలో 100 జావెలిన్ మిస్సైళ్లు, 1 ప్లైటు బై రౌండ్, 25 కమాండ్ లాంచ్ యూనిట్లు, ట్రైనింగ్ ఎయిడ్‌లు, సిమ్యులేషన్ రౌండ్లు, ఆయుధ సామగ్రితో ముడిపడిన విడి భాగాలు ఉన్నాయని డీఎస్‌సీఏ తెలిపింది.


-మిగతా 2 లో

## 25న పంచాయతీ

# షెడ్యూల్?

### మూడు దశల్లో పోలింగ్ ప్రక్రియ

- డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో ఎన్నికల నిర్వహణకు చర్యలు :
- సీఎస్, డీజీపీతో కలిసి వీడియో కాన్ఫరెన్స్
- రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ నివేదిక సమర్పణ
- జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు ఎస్ఈసీ ఆదేశం



**హైదరాబాద్ నవంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):** రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను 25న ప్రకటించే అవకాశముంది. మూడు దశల్లో నిర్వహించే ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) ఆదేశించింది. గురువారం పంచాయతీ ఎన్నికల నిర్వహణపై హైదరాబాద్‌లోని ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యాలయం నుంచి సీఎస్ రామకృష్ణరావు, డీజీపీ శివధర్‌రెడ్డితో కలిసి కమిషనర్ రాణి కుముదిని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై కమిషనర్ అధికారులకు పలు సూచనలు చేశారు.

-మిగతా 2 లో




## బూటకపు ఎన్‌కౌంటర్లను ఖండిద్దాం

- పౌర సమాజం స్పందించకపోతే భవిష్యత్ మరింత ప్రమాదకరం
- పేదల కోసం పనిచేసే మావోయిస్టులతో చర్చలెందుకు జరపరు?
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష, కాంగ్రెస్ పార్టీల నేతలు
- నేడు అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా
- కేంద్రం తీరును తప్పుబడుతూ సంతకాల సేకరణ

**హైదరాబాద్**
బూటకపు ఎన్‌కౌంటర్లతో మావోయిస్టులను హత్యచేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్టు గురువారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం ప్రకటించింది. బూటకపు ఎన్‌కౌంటర్లను తప్పుబడుతూ ప్రజల నుంచి సంతకాల సేకరణ చేయాలని నిర్ణయించింది. పాక్ ఉగ్రవాదులపై సైతం చర్చలు జరుపుతున్న కేంద్ర ప్రభుత్వం..ప్రజల కోసం పనిచేస్తున్న దేశపౌరులైన మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపట్లేదని ప్రశ్నించింది. బూటకపు ఎన్‌కౌంటర్లపై పౌర సమాజం స్పందించకపోతే భవిష్యత్ మరింత ప్రమాదకరంగా మారుతుందని హెచ్చరించింది. అటవీ ప్రాంతాల్లో విలువైన ఖనిజ సంపదను మార్చి 2026 నాటికి కార్పొరేట్లకు అప్పగించేందుకు మోడీ సర్కారు మాట ఇచ్చిందనీ, అందుకే అడ్డుగా ఉన్న మావోయిస్టులను ఎన్‌కౌంటర్ల పేరుతో చంపేయిస్తున్నదని విమర్శించింది. లొంగిపోయేందుకు ప్రయత్నించిన వారిని, కాల్పులు విరమించి

-మిగతా 2 లో



## కేటీఆర్‌కు బిగ్ షాక్

- ఫార్ములా -కారు రేసు కేసు విచారణకు గవర్నర్ అనుమతి
- ఈ-కార్ రేసింగ్‌లో రూ.54.88 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణ
- ఏసీబీ అధికారులకు అనుమతి ఇస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్,- నవంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):** మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు బిగ్ షాక్ తగిలింది. ఈ ఫార్ములా -కారు రేసు కేసుకు సంబంధించి ఆయనపై విచారణ చేపట్టేందుకు గవర్నర్ అధికారికంగా అనుమతి మంజూరు చేశారు. ఈ కేసులోనిధుల దుర్వినియోగంపై విచారణ కొనసాగించేందుకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గవర్నర్ అనుమతితో ఏసీబీ త్వరలోనే కేటీఆర్‌పై చార్జ్‌షీట్ దాఖలు

-మిగతా 2 లో




## సీబీఐ కోర్టుకు హాజరైన జగన్

- వ్యక్తిగత హాజరు తో పూర్తయిన లాంఛనం
- జగన్ రాకతో అభిమానుల హల్‌చల్

2 లో

# గవర్నర్లు, రాష్ట్రపతికి గడవు విధించలేం

మొదటి తరువాయి

తెలిపింది. రాష్ట్ర పరిపాలనలో తుది అధికారం ఎన్నుకోబడిన మంత్రివర్గానిదేనని స్పష్టం చేసింది. ఒక రాష్ట్రంలో రెండు ఎగ్జిక్యూటివ్ పవర్స్ ఉండవని, ప్రభుత్వం ఒక్కటే ప్రధాన నిర్ణయాధికారి అని తేల్చి చెప్పింది. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లులకు ఆమోదం తెలిపే విషయంలో న్యాయస్థానం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించటంపై ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పంపిన ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్‌పై స్పందిస్తూ సుప్రీంకోర్టు ఈ తీర్పును వెలువరించింది. రాష్టర శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులకు సమ్మతి తెలిపే అంశంలో సుప్రీంకోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. ఈ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానం గడువు విధించడంపై దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము సంధించిన ప్రశ్నలపై అత్యున్నత న్యాయస్థానం సమాధానమిచ్చింది. పెండింగ్ బిల్లుల ఆమోదం కోసం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును విధించడం తగదని సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టంచేసింది. అయితే, కారణం చెప్పకుండా గవర్నర్లు బిల్లులను వెనక్కి పంపలేరని వెల్లడించింది. ఈ మేరకు దీనిపై గతంలో ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును సీజేఐ ధర్మాసనం పక్కనబెట్టింది. గవర్నర్‌కు రాజ్యాంగపరంగా మూడు ఆప్షన్లు ఉంటాయి. బిల్లులకు సమ్మతి తెలియజేయడం, కారణం చెప్పి బిల్లును రిజర్వ్‌లో పెట్టడం లేదా రాష్ట్రపతికి పంపడం, బిల్లును తిరస్కరించి అసెంబ్లీకి పంపడం. ఈ మూడు ఆప్షన్లు ఎంచుకోవడంలో గవర్నర్ విచక్షణాధికారాన్ని ఉపయోగిస్తారు. ఇందుకు న్యాయస్థానాలు గడువు విధించడం సబబు కాదని అభిప్రాయపడ్డారు. గవర్నర్ల విధుల నిర్వహణ వ్యవహారాల్లో కోర్టులు జోక్యం చేసుకోవు. కానీ, కారణం లేకుండా దీర్ఘకాలంగా బిల్లులను పెండింగ్‌లో ఉంచిన సందర్భాల్లో కోర్టులు పరిమిత విచక్షణతో వ్యవహరించొచ్చు. రాష్ట్రపతి విషయంలోనూ ఇదే వర్తిస్తుంది. నిరవధిక ఆలస్యం కొనసాగుతున్న సందర్భాల్లో అది న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని తెలిపారు. గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి రిజర్వ్ చేసిన ప్రతిసారీ ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి సుప్రీంను సంప్రదించాల్సిన అవసరం లేదు. ఆర్టికల్ 200 కింద గవర్నర్లకు విచక్షణాధికారం ఉంటుంది. అయితే, దాన్ని అపరిమితంగా వినియోగించలేరు. శాసనసభలు ఒకటికి రెండుసార్లు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఆమోదం తెలపకుండా కాలయాపన చేయడం, రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నవీ తీవ్ర జాప్యానికి గురికావడంపై ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించింది. గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆ బిల్లులను ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం నిర్దేశిరచింది. దీంతో రాజ్యాంగ అధికరణం 143(1) ప్రకారం తనకున్న అధికారాన్ని వినియోగిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మే నెలలో పలు ప్రశ్నలతో సీజేఐకి లేఖ రాశారు. రాష్ట్రపతి విచక్షణ అధికారాల పరిధిలోకి వచ్చే రాష్ట్రాల బిల్లులకు ఆమోదం తెలిపే అంశంలో న్యాయస్థానం గడువు విధించడం ఎంతవరకు న్యాయ సమ్మతమో తెలపాలంటూ సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరారు. దీనిపై సీజేఐ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటైంది. పది రోజుల పాటు అన్ని పక్షాల వాదనలను ఆలకించిన ధర్మాసనం సెప్టెంబరు 11న తీర్పు రిజర్వు చేసింది. ఈ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించలేమంటూ తాజాగా తీర్పు వెలువరించింది.

# ట్రంప్ సర్కార్ పచ్చజెండా

మొదటి తరువాయి

రూ.417 కోట్ల విలువైన 216 యూనిట్ల 'ఎం982ఏ1 ప్రొజెక్టైల్స్'ను, రూ.405 కోట్ల విలువైన 126 యూనిట్ల జావెలిన్ మిస్సైల్ సిస్టమ్‌లను భారత్‌కు విక్రయిస్తున్నట్టు పేర్కొంది. ఈ మొత్తం సామగ్రికి అమెరికా సైన్యం వైపు నుంచి పూర్తిస్థాయి జీవితకాల మద్దతు లభిస్తుందని వెల్లడించింది. ఈ ప్రతిపాదిత లావాదేవీకి అవసరమైన సర్టిఫికేషన్‌ను అమెరికా కాంగ్రెస్‌కు డీఎస్‌సీఏ అందజేసింది. ఇండో-పసిఫిక్, దక్షిణాసియాల్లో సుస్థిరతే లక్ష్యం "అమెరికా-భారత్‌ల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు, ప్రధాన రక్షణరంగ భాగస్వామి అయిన భారత్ భద్రతను మెరుగుపర్చేందుకు ఈ ఆయుధ సామగ్రిని విక్రయిస్తున్నాం. ఈ విక్రయ డీల్ అమెరికా విదేశాంగ విధానం, జాతీయ భద్రతా లక్ష్యాలకు మద్దతును అందిస్తుంది. దీనివల్ల ఇండో-పసిఫిక్, దక్షిణ ఆసియా ప్రాంతాల్లో రాజకీయ సుస్థిరత, శాంతి, ఆర్థిక వికాసానికి ఊతం లభిస్తుంది. ఆ ప్రాంతాల్లో సైనికపరమైన సమతుల్యత కూడా ఏర్పడుతుంది. ఈ ఆయుధ సామగ్రి ప్రస్తుత, భవిష్యత్ ముప్పులను అత్యంత కచ్చితత్వంతో ఎదుర్కొనేలా భారత్‌కు ఉపయోగపడుతుంది. కచ్చితత్వంతో దాడులు చేయగల సామర్థ్యం భారత్‌కు లభిస్తుంది. ఈ సామగ్రిని భారత సైన్యం సమర్థవంతంగా వినియోగించగలదు" అని డీఎస్‌సీఏ ఓ ప్రకటనలో వెల్లడించింది. అయితే అమెరికా మెప్పుకోసమే మోడీ భారీగా రక్షణ ఆయుధాలను కొంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# 25న పంచాయతీ షెడ్యూల్?

మొదటి తరువాయి

గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల ప్రచురణ, ఎన్నికల నిర్వహణకు రవాణా ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బంది కేటాయింపు, పరిశీలకుల మోహరింపు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్వేచ్ఛగా, నిస్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు. సమీక్షలో ఎన్నికల పరిశీలకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ నివేదిక**

పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. పంచాయతీలు, వార్డుల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు 50 శాతం మించకుండా సిఫారసు చేసింది. డెడికేటెడ్ కమిషన్ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయనుంది. ఈనెల 24న హైకోర్టు విచారణకు ముందే రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రక్రియను పూర్తి చేయనుంది. ఈనెల 24 లేదా 25న షెడ్యూల్ ప్రకటించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. 12,733 పంచాయతీ, 1,12,288 వార్డుల్లో మూడు విడతల్లో డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో ఎన్నికలు పూర్తి చేసేలా కసరత్తు చేస్తోంది. మొత్తం పోలింగ్ ప్రక్రియను డిసెంబరు 16 వరకు పూర్తి చేయనున్నట్టు సమాచారం.

# సీబీఐ కోర్టుకు హాజరైన జగన్

**వ్యక్తిగత హాజరు తో పూర్తయిన లాంఛనం**

**జగన్ రాకతో అభిమానుల హల్‌చల్**

హైదరాబాద్,

అక్రమాస్తుల కేసులో వైకాపా అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ సీబీఐ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. న్యాయమూర్తి ఎదుట విచారణకు వచ్చారు. విజయవాడ నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు వచ్చి అక్కడి నుంచి నాంపల్లిలోని కోర్టుకు ఆయన చేరుకున్నారు. విచారణ అనంతరం జగన్ అక్కడి నుంచి లోటస్‌పాండ్‌కు వెళ్లిపోయారు. మరోవైపు వైకాపా నేత పేర్ని నాని, మరో ముగ్గురు నేతలను కోర్టు లోపలికి పోలీసులు అనుమతించలేదు. దీంతో వారు గేట్ వద్దే నిలుచున్నారు. ఈ కేసులో




2013 సెప్టెంబర్ నుంచి జగన్ బెయిల్‌పై ఉన్నారు. ఇప్పుడు కూడా వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరగా సీబీఐ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆరేళ్లుగా జగన్ కోర్టుకు ప్రత్యక్షంగా హాజరవడం లేదని, ఈ కేసుల్లో డిశ్చార్జి పిటిషన్లపై రోజువారీ విచారణ జరుగుతున్నందున ప్రత్యక్షంగా హాజరవ్వాలని సీబీఐ తెలిపింది. దీంతో ఈ నెల 21లోగా వ్యక్తిగతంగా హాజరవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒకరోజు ముందే ఆయన కోర్టుకు హాజరయ్యారు. అక్రమాస్తుల కేసులో వైకాపా అధ్యక్షుడు జగన్ సీబీఐ కోర్టుకు హాజరుకానున్న నేపథ్యంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్ వద్ద వైకాపా కార్యకర్తలు హల్‌చల్ చేశారు. కొందరు రప్పా రప్పా అంటూ నినాదాలు చేశారు. ఎయిర్ పోర్టు లోపలికి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారితో వాగ్వాదానికి దిగారు. మరోవైపు సీబీఐ కోర్టు వద్ద పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు.

# కేటీఆర్‌కు బిగ్ షాక్

మొదటి తరువాయి

చేయనుందని సమాచారం. ప్రభుత్వం ఈ విషయంలో లేఖ రాయడంతో ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతించారు. ఈ కేసులో ఇప్పటికే పలుమార్లు కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌లో రూ.54.88 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈక్రమంలో కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి కోరుతూ గతంలో ఏసీబీ లేఖ రాసింది. ఆయన పాత్రపై సాక్ష్యాలు ఉన్నాయంటూ అందులో పేర్కొంది. ఈక్రమంలో తాజాగా ఏసీబీ అధికారులకు అనుమతి ఇస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో త్వరలోనే ఏసీబీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయనుంది. ఈ కేసులో కేటీఆర్‌ను ఏ-1 గా, సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ను ఏ-2గా ఏసీబీ పేర్కొంది. ఇప్పటికే కేటీఆర్ ఈ కేసు విషయంలో ఏసీబీ విచారణకు నాలుగు సార్లు హాజరయ్యారు. ఈ కేసులో ఏ-2గా ఉన్న ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ విషయంలో తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులు ఇప్పటికే కేంద్రంలోని డీఓపీటీకు లేఖ రాశారు.



గవర్నర్ అనుమతి నేపథ్యంలో, చార్జ్‌షీట్ దాఖలుకు ముందు ఏసీబీ అధికారులు మరోసారి కేటీఆర్‌ను లేదా ఇతర కీలక వ్యక్తులను విచారించే అవకాశం ఉంది. ఈ కేసుపై గవర్నర్ అనుమతి లభించడంతో, రాజకీయ వర్గాలలో, పరిపాలనా వర్గాలలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఏసీబీ త్వరలో దాఖలు చేయబోయే చార్జ్‌షీట్‌తో ఈ కేసు విచారణ కీలక మలుపు తిరగనుంది. ఫార్ములా ఈ-కారు రేసులో క్విడ్ ప్రోకో జరిగినట్టు ఏసీబీ నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే. రూ.54.88 కోట్ల నిధులు దారి మళ్లింపుపై ఆరోపణలు చేసింది. ఇక, 2024లో ఫార్ములా ఈ-కారు కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కార్ రేస్ వ్యవహారంలో 2024 డిసెంబర్ నెలలో ఏసీబీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏ1గా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. కేసు విచారణలో భాగంగా ఇప్పటికే కేటీఆర్‌ను రెండు సార్లు, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను 3 సార్లు ఏసీబీ అధికారులు విచారించారు. తాజాగా ప్రభుత్వానికి నివేదికను సమర్పించారు. కేసుకు సంబంధించిన నివేదికను అవినీతి నిరోధక శాఖ( ఏసీబీ) అధికారులు మంగళవారం తెలంగాణ ప్రభుత్వానికి అందించారు. ప్రాసిక్యూషన్ అనుమతి కోరుతూ ఏసీబీ అధికారులు ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేటీఆర్ మున్సిపల్ శాఖ మంత్రిగా పనిచేశారు. ఈ నేపథ్యంలో కేటీఆర్‌ను ఈ కేసులో ఏ1గా పేర్కొంటూ ఏసీబీ కేసు నమోదు చేసింది. ఫార్ములా- ఈ కార్ రేసు నిర్వహణ కోసం యూకేకు చెందిన ఫార్ములా-ఈ ఆపరేషన్స్, ఏస్ నెక్ట్స్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్, తెలంగాణ పురపాలకశాఖ 2022 అక్టోబరు 25న ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం కార్ రేస్ నిర్వహణకు అయ్యే ఖర్చును స్పాన్సర్‌గా ఉన్న ఏస్ నెక్ట్స్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్ భరించాలి. అలాగే కార్ రేసు నిర్వహణకు వీలుగా తెలంగాణ పురపాలక శాఖ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలి. అందులో భాగంగా 2023 ఫిబ్రవరి 11 జరిగిన రేస్ కోసం తెలంగాణ పురపాలక శాఖ తరుపున హెచ్ఎండీఏ రూ.12 కోట్లు ఖర్చు చేసింది.

# బీహార్ సీఎంగా నితీశ్ ప్రమాణం

మొదటి తరువాయి

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అదరగొట్టింది. మొత్తం 243 అసెంబ్లీ సీట్లకు నితీశ్ కుమార్ నేతృత్వంలో ఎన్డీయే ఏకంగా 202 సీట్లు దక్కించుకుంది. బీజేపీ 101 సీట్లలో పోటీ చేసి 89 చోట్ల గెలుపొందింది. 101 సీట్లలోనే పోటీ చేసిన జేడీయూ 85 చోట్ల విజయం సాధించింది. తాజాగా ప్రమాణస్వీకారం చేసిన 27 మంత్రుల్లో.. 14 మంది బీజేపీ నుంచి కాగా, 9 మంది జేడీయూకు చెందిన నేతలు. బిహార్‌లో సీఎం నితీశ్ కుమార్ దాదాపు 19 ఏళ్లు పదవిలో ఉన్నారు. 2000 సంవత్సరంలో ఏడు రోజులు మాత్రమే సీఎంగా పని చేశారు. ఇప్పుడు ఎన్డీయే కూటమి మళ్లీ ఆయనకే పగ్గాలు అప్పగించడంతో పదోసారి సీఎంగా ప్రమాణం చేశారు. పదోసారి బిహార్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నితీశ్ కుమార్‌కు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. 'సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నితీశ్ కుమార్‌కు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. నితీశ్ రాజకీయంలో ఎంతో అనుభవం ఉన్న నాయకుడు. రాష్ట్రంలో మంచి పాలన అందించిన వ్యక్తి అనే అద్భుతమైన రికార్డు ఆయనకు ఉందని ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు.

# నేడు హైదరాబాద్‌కు రాష్ట్రపతి రాక

మొదటి తరువాయి

చేరుకుంటారు. రాత్రి తెలంగాణ రాజ్‌భవన్‌లో రాష్ట్రపతి ముర్ము బస చేయనున్నారు. 22వ తేదీ అంటే..శనివారం ఉదయం 9:30 గంటలకు బేగంపేట ఎయిర్ పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో ఆంధ్రప్రదేశ్ శ్రీసత్యసాయి జిల్లాలోని పుట్టపర్తికి బయలుదేరి వెళ్తారు. శ్రీ సత్యసాయి బాబా శత జయంత్యోత్సవాల్లో రాష్ట్రపతి ముర్ము పాల్గొనున్నారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో హైదరాబాద్‌లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

# సన్న బియ్యం పంపిణీ పథకం విజయవంతం

మొదటి తరువాయి

పథకాన్ని అమల్లోకి తెచ్చేలా నిర్ణయం తీసుకుటుందని హామీ ఇచ్చారు. గురువారం హైదరాబాద్‌కు వచ్చిన కేంద్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషితో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఆయనతో పాటు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, పౌరసరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి స్టీఫెన్ రవీంద్ర తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి తగిన సహాయ సహకారాలు అందించాలంటూ సీఎం పలు అంశాలను కేంద్రమంత్రి వద్ద ప్రస్తావించారు. 2024-25 రబీ సీజన్‌కు సంబంధించి అదనంగా 10 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ కోటా పెంచాలని కోరారు. పీడీఎస్ కింద సరఫరా చేసిన లెవీ రైస్‌కు సంబంధించిన రూ.1,468 కోట్ల సబ్సిడీ విడుదల చేయాలన్నారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్నయోజన (పీఎంజీకేఏవై) అయిదో దశకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.343.27 కోట్ల సబ్సిడీని కూడా విడుదల చేయాలని కోరారు. 2024-25 ఖరీఫ్ కస్టమ్ మిల్లింగ్ రైస్ వ్యవధి పొడిగించాలనీ, ఎఫ్‌సీఐ గోదాముల్లో నిల్వ ఇబ్బందులను అధిగమించేందుకు అదనపు బాయిల్డ్ రైస్ ర్యాక్‌లు కేటాయించాలని, రాష్ట్రంలో 15 లక్షల మెట్రిక్ టన్నుల గోదాముల నిల్వ సామర్థ్యం పెంచుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. 2025-26 ఖరీఫ్‌లో అత్యధికంగా 148 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని, ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని 80 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాలని కోరారు. ఈ డిమాండ్లన్నింటిపై కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషీ సానుకూలంగా స్పందించారు. త్వరలో వీటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బాయిల్డ్ రైస్ అవసరం తగ్గిందనీ, అందువల్ల మిల్లింగ్‌కు అనువైన ముడి బియ్యం రకాల సాగును ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలో మిగులు ధాన్యం నిల్వలను సమర్థంగా నిర్వహించేందుకు ఎగుమతి అవకాశాలను పరిశీలించుకోవాలని సూచించారు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేపై విచారణ

మొదటి తరువాయి

ఎదుర్కుంటున్న ఎమ్మెల్యేల విచారణ గురువారంతో ముగిసింది. కేసు విచారణ ఆలస్యంపై సుప్రీం సీరియస్ అవడంతో పాటు నాలుగు వారాలు గడువు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విచారణలో వేగం పెంచాలని అసెంబ్లీ స్పీకర్ నిర్ణయించారు. ఇందులో భాగంగా రెండో విడత విచారణలో భాగంగా నలుగురు ఎమ్మెల్యేలను విచారణకు పిలిచారు. ఉదయం ఎమ్మెల్యేల విచారణ మొదలైంది. పోచారం శ్రీనివాస్ రెడ్డి వర్సెస్ జగదీశ్ రెడ్డి కేసును స్పీకర్ విచారించారు. ఇరు వర్గాల వాదనలను స్పీకర్ విన్నారు. అలాగే మధ్యాహ్నం అరికెపూడి గాంధీ వర్సెస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కేసు విచారించారు. వీరి విచారణతో మొత్తం ఎనిమిది మంది ఎమ్మెల్యేల విచారణ పూర్తి అవుతుంది. మరోవైపు ఎమ్మెల్యే దానం నాగేందర్ ఢిల్లీ వెళ్లారు. ఏఐసీసీ పెద్దలను కలవనున్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ ముగియనున్నప్పటికీ ఇప్పటి వరకు దానం అఫిడవిట్లు దాఖలు చేయలేదు. విచారణకు హాజరైతే వేటు పడుతుందని దానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. వేటు పడితే ఆరు సంవత్సరాల పాటు పోటీ చేయడానికి నో ఛాన్స్. ఈ క్రమంలో రాజీనామా చేసేందుకు దానం మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. రాజీనామా చేస్తే తన పరిస్థితి ఏంటని పార్టీ పెద్దలతో దానం సంప్రదింపులు జరుపనున్నట్లు తెలుస్తోంది.

# బూటకపు ఎన్‌కౌంటర్లను ఖండిద్దాం

మొదటి తరువాయి

షెల్టర్ తీసుకుంటున్న మావోయిస్టులను చుట్టుముట్టి కాల్చి చంపడాన్ని తప్పుబట్టింది. దేశసంపదను కార్పొరేట్లకు దోచిపెట్టడం దేశభక్తి ఎలా అవుతుందని ప్రశ్నించింది.

**దేశంలో కమ్యూనిస్టులు బలపడాలి : టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్**

దేశంలో కేంద్రంలోని మోడీ సర్కారు విధానాలతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్న తరుణంలో కమ్యూనిస్టులు మరింత బలపడాల్సిన అవసరం ఉందని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ అభిప్రాయపడ్డారు. వామపక్షభావజాలం ఉన్న వారిని బలహీనపర్చే ఎలిమినేషన్ ప్రక్రియను బీజేపీ సర్కారు ప్రారంభించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో కమ్యూనిస్టు పార్టీలు, కాంగ్రెస్, సోషలిస్టు భావజాలం కలిగిన ఇతర పార్టీలు ఏకమై బీజేపీపై పోరాడాల్సిన ఆవశ్యకత నేడు నెలకొందని చెప్పారు. ఫాసిస్టు శక్తులు బలపడితే దేశానికి, సమాజానికి ప్రమాదకరమని హెచ్చరించారు.

# ముర్తుజపల్లి గ్రామ సమస్యలపై ఎమ్మెల్యే సానుకూల స్పందన

**ఆమనగల్, నవంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ముర్తుజపల్లి గ్రామ సమస్యల పరిష్కారానికి గ్రామస్తులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ని ఈరోజు వారి క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సమావేశం కర్నాటి సాయి రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. గ్రామానికి చెందిన సుమారు 20 మంది ప్రజలు ఇందులో పాల్గొన్నారు.గ్రామస్తులు ముఖ్యంగా ఊరబావి పక్కన ఉన్న రహదారి ప్రమాదకర స్థితిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. వాహనాలు బావిలో పడే ప్రమాదం ఉన్నందున క్రింది నుంచి గోడ కట్టి రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. అదనంగా ముర్తుజపల్లి నుండి మాడుగుల వరకు 1.5 కిలోమీటర్ల రహదారి నిర్మాణం, గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించడం,




విద్యార్థుల కోసం రవాణా సౌకర్యం వంటి అంశాలను ప్రస్తావించారు.గ్రామంలో దాదాపు 50 మంది విద్యార్థులు ఇతర ఊర్లకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోందని, ప్రతి అవసరానికి ఆమనగల్ వరకు వెళ్లాల్సి వస్తోందని గ్రామస్తులు వివరించారు. ఈ సమస్యలన్నింటినీ రాతపూర్వకంగా కూడా ఎమ్మెల్యేకు సమర్పించారు.గ్రామస్తుల వినతిని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సానుకూలంగా స్వీకరించి, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ హామీ పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో ముర్తుజపల్లి గ్రామానికి చెందిన తిరుపతయ్య, జగన్ రెడ్డి, శేఖర్, నరేందర్ రెడ్డి, వీరారెడ్డి, రత్న కుమార్ రెడ్డి, బాలయ్య, రామస్వామి, శ్రీను, మల్లేష్, చంద్రశేఖర్, రాజు, మహేష్, తిరుపతి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ నేత రవీందర్ యాదవ్ ధ్వజం

**శేరిలింగంపల్లి,నవంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతోందని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, శేరిలింగంపల్లి యువ నాయకుడు రవీందర్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టి ఇబ్బంది పెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌పై కక్ష సాధింపులను



చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ సీఎం రేవంత్ రెడ్డి మరో చిల్లర డ్రామాకు ప్రయత్నిస్తున్నాడని వ్యాఖ్యానించారు. కేటీఆర్‌పై ఏసీబీ విచారణకు గవర్నర్ అనుమతి ఇవ్వడంపై స్పందిస్తూ, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం జరుగుతోందని ధ్వజమెత్తారు. ఫార్ములా ఈ రేస్ పూర్తి పారదర్శకతతో జరిగిందని, దీనిపై కేసు పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లుగా కోడిగుడ్డుపై ఈకలు పీకుతున్నట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు.హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని పెంచిన కేటీఆర్‌పై కుట్రలు పన్ని ఇబ్బంది పెట్టడమే లక్ష్యమని ఆయన ఆరోపించారు. కేటీఆర్‌కు బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉందని, కాంగ్రెస్ వైఖరిని న్యాయపరంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.ప్రజల దృష్టిని మరల్చేందుకు కుట్రలు పన్నుతున్న కాంగ్రెస్ తీరుపై పోరాటానికి బీఆర్ఎస్ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని రవీందర్ యాదవ్ పిలుపునిచ్చారు.

# నాయి బ్రాహ్మణుల పోరాటానికి అండగా ఉంటానన్న ఎమ్మెల్యే వివేకానంద్



**కుత్బుల్లాపూర్,నవంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులు పేట్ బషీరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్‌ను కలిశారు. కార్పొరేట్ సెలూన్ల విస్తరణతో నాయి బ్రాహ్మణుల సంప్రదాయ కులవృత్తి ఉనికిని కోల్పోతున్న పరిస్థితిని వివరించారు. అన్య కులస్తులు సెలూన్లను ప్రారంభించడం వల్ల జీవనోపాధి కష్టంగా మారిందని, సమస్యల పరిష్కారం కోసం సహకారం అందించాలని కోరారు.ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ కులవృత్తుల పరిరక్షణలో నాయి బ్రాహ్మణ సంఘానికి తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారంలో ఐకమత్యంగా ఉండాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ఓం మణికంఠ నాయి బ్రాహ్మణ సేవా సంఘం కుత్బుల్లాపూర్ అధ్యక్షుడు గడల వెంకటేశ్వర్లు, చీఫ్ సెక్రటరీ వి.ఎస్.ఆర్. వెంకట్, చైర్మన్ గడ్డం రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్లు హరికృష్ణ, ప్రసాద్, రవి నాయితో పాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# డ్రిప్ ఇరిగేషన్ ద్వారా వరి సాగు పరిశీలించిన రైతు కమిషన్

**యాచారం, నవంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)** రంగారెడ్డి జిల్లా యాచారం మండలం చౌదరి పల్లి గ్రామంలో ఆదర్శ రైతు కాశిమల్ల వెంకట రామయ్య డ్రిప్ ద్వారా సాగుచేసిన వరి పొలాన్ని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు కేవీఎన్ రెడ్డి, భవానీ రెడ్డి, వ్యవసాయ మరియు ఉద్యానవన శాఖ అధికారులు పరిశీలించారు. అనంతరం యాచారం రైతు వేదికలో రైతులు, అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ తక్కువ నీటి వినియోగంతో డ్రిప్ ద్వారా వరి సాగు చేయడం విశేషమని అభిప్రాయపడ్డారు. ఉద్యానవన పంటలకు మాత్రమే పరిమితమైన డ్రిప్‌ను వరి సాగులో వినియోగించడం సాధారణ విషయం కాదని అన్నారు. ఇటీవల కమిషన్ బృందం కేరళ పర్యటించిందని, అక్కడి వ్యవసాయ పద్ధతులు ఆధునికంగా ఉన్నాయని వివరించారు.కేరళలో రైతులు సంఘటితంగా



ఉద్యానవన పంటలు సాగుచేస్తున్నారని, మార్కెట్ విధానం వినియోగానికి అనుగుణంగా ఉందని తెలిపారు. కౌలు రైతు విధానం కూడా సమర్థవంతంగా అమలవుతోందని పేర్కొన్నారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి కేరళ స్టడీ టూర్‌పై నివేదిక అందజేస్తామని, అక్కడి విధానాలను తెలంగాణలో అమలయ్యేలా సూచనలు చేస్తామని వెల్లడించారు.రంగారెడ్డి జిల్లా ఉద్యానవన పంటలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుందని, అయితే ఇటీవల కూరగాయల సాగు తగ్గిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు ఉద్యానవన పంటల సాగు పెంచాలని, మార్కెట్ సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతామని తెలిపారు. సంఘటితంగా సాగు చేయాలని రైతులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అనుకూలంగా పనిచేస్తుందని, సీఎం రేవంత్ రెడ్డి రైతు బిడ్డగా వ్యవసాయ అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు.సమావేశంలో కొందరు రైతులు పట్టా పాస్ బుక్‌లు అందలేదని సమస్యను ప్రస్తావించారు. దీనిపై రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంపై కోదండరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కమిషన్ మెంబర్ సెక్రటరీ గోపాల్, జిల్లా వ్యవసాయాధికారి డి. ఉషా, జిల్లా హార్టికల్చర్ అధికారి సురేష్, ఇబ్రహీంపట్నం ఏడీ సుజాత, వ్యవసాయ అధికారి రావినాథ్, కమిషన్ అధికారులు మహేష్, రజితతో పాటు మార్కెటింగ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


# జి.ఎం సి.హెచ్.పి పర్యటన

**రామగిరి నవంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):** సింగరేణి సంస్థ కార్పోరేట్ సిహెచ్పి ల విభాగం జనరల్ మేనేజర్ ఎస్.వి.రామమూర్తి గురువారం రామగుండం-3 ఏరియాలో పర్యటించారు.
నూతనంగా కార్పోరేట్ సిహెచ్పి ల విభాగం జనరల్ మేనేజర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటిసారిగా ఏరియాలో పర్యటించిన సందర్భంగా జి.యం.కార్యాలయం నందు



రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు వారిని శాలువాతో సత్కరించి, మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు ఏరియా లోని సిహెచ్పిని సందర్శించి,పరిశీలించారు.కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ వై.వి.శేఖర్ బాబు,సిహెచ్పి డిజియం కాశీ విశ్వేశ్వర రావు,ఇతర అధికారులు ఉన్నారు.

# గ్రామ పంచాయతీల ఎన్నికల షెడ్యూల్ ప్రకటన



**ఆమనగల్లు, నవంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):** రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన నోటిఫికేషన్ నం.716 ప్రకారం సర్పంచ్ ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో 02.09.2025న ప్రచురించిన గ్రామ పంచాయతీ ఓటర్ లిస్ట్ ఈరోజు అన్ని గ్రామ పంచాయతీలలో, మండల పరిషత్ కార్యాలయ నోటీసు బోర్డులపై ప్రదర్శించబడింది.గ్రామానికి సంబంధించిన ఓటర్ మిస్ మాపింగ్స్ ఉన్నచో, సంబంధిత గ్రామ కార్యదర్శికి దరఖాస్తులు సమర్పించవలసి ఉంటుంది. ఈ దరఖాస్తులు నవంబర్ 20 నుండి 21 వరకు స్వీకరించబడతాయి. అనంతరం 22న జిల్లా ప్రణాళికాధికారికి పంపించి పరిష్కరించబడతాయి అని తదుపరి 23న తుది ఓటర్ లిస్ట్‌తో పాటు పోలింగ్ స్టేషన్ల వివరాలు అధికారికంగా ప్రకటించబడతాయి అని అసిస్టెంట్ జిల్లా ఎన్నికల అధికారి ,ఆమనగల్లు మండల ఎంపీడీఓ కుసుమ మాధురి పేర్కొన్నారు.

# గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యం



**ఆమనగల్, నవంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)** ఆమనగల్ మండలంలోని 33/11 కె.వి. పోలేపల్లి విద్యుత్ ఉపకేంద్రంలో పోలేపల్లి గ్రామానికి నిరంతర విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేకంగా 11 కె.వి. పోలేపల్లి ఫీడర్‌ను ఏర్పాటు చేశారు. గ్రామానికి ఏర్పాటు చేసిన బ్రేకర్‌ను గ్రామ రైతుల సమక్షంలో సిఇ పాండ్య నాయక్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు 24 గంటల విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఫీడర్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎస్ఇ మోహన్,కందుకూర్ డిఇ గోపాలకృష్ణ, ఆమనగల్ ఎడిఇ బాలకృష్ణ, ఎఇ శంకర్‌తో పాటు ఇతర విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# అడవిదేవులపల్లిలో అఖండ శివనామ సంకీర్తన ప్రారంభం



**అడవిదేవులపల్లి, నవంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)** అడవిదేవులపల్లి గ్రామంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని అఖండ శివనామ సంకీర్తన కార్యక్రమం ప్రారంభమైంది. గత 60 సంవత్సరాలుగా నిరవధికంగా మూడు రోజుల పాటు భజన బృందం శివనామాన్ని ఆలపించడం సంప్రదాయంగా కొనసాగుతోంది. సంకీర్తన అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరుగుతుంది.ఈ కార్యక్రమాన్ని పూజారి వెల్లటూరి రామ్మోహన్ ప్రారంభించారు. కూరాకుల రవీంద్రనాథ్, పసుపులేటి ఆంజనేయులు, తడికమల్ల మల్లికార్జున్, శ్రీరామ్ రామకృష్ణ, బండి పకీరయ్య, ఎర్రబోతు దుర్గయ్య, మండల సైదులు, అంజమ్మతో పాటు అనేక మంది భక్తులు పాల్గొన్నారు.

# విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమీక్ష నిర్వహించిన ఎంపీ మల్లు రవి

**అమ్రాబాద్, నవంబర్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమీక్ష సమావేశం జరిగింది.ఈ సమావేశానికి నాగర్ కర్నూల్




ఎంపీ డాక్టర్ మల్లు రవి అధ్యక్షత వహించారు. జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్, ఎమ్మెల్యేలు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, జిల్లా ఎస్సీ, ఎస్టీ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.సమావేశంలో అభివృద్ధి కార్యక్రమాల అమలు, సంక్షేమ పథకాల పురోగతి, ప్రజలకు చేరువయ్యే విధానాలపై సమీక్ష జరిగింది. అధికారులు సంబంధిత అంశాలపై నివేదికలు సమర్పించారు.

# భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులుగా నారాయణ.



**ఎలిగేడు, నవంబర్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మండలం భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీని జిల్లా అధ్యక్షులు చిలువేరు స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు మండల అధ్యక్షునిగా కనుకుంట్ల నారాయణ, గౌరవాధ్యక్షులుగా బొట్ల రాజు , ఉపాధ్యక్షులుగా కవంపల్లి శ్రీనివాస్ ,గుర్రం ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా గోగుల రాజు, సహాయ కార్యదర్శి బుర్ల రాజమౌళి, తీట్ల శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా దేవండ్ల శివ, కోశాధికారిగా ఉపేంద్ర, కార్యవర్గ సభ్యులుగా ఇరుగురాల లక్ష్మీ నరసయ్య, జల్లి లచ్చయ్య ,కవ్వంపల్లి లింగయ్య, రాకపాలెం మనీ రెడ్డి, గోస్కి తిరుపతి ,ఆకుదారి భూమయ్య ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షుడు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, కార్మికుల సంక్షేమం కోసం అహర్నిశలు పనిచేస్తానని హామీ ఇచ్చారు.

# గౌరీ శంకర్ ను పరామర్శించిన అచ్చంపేట ఎమ్మెల్యే



**అచ్చంపేట, నవంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అచ్చంపేట పట్టణ కేంద్రంలోని 1వ వార్డు కౌన్సిలర్ గౌరీ శంకర్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందిన అనంతరం స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయనను పరామర్శించేందుకు టిపిసిసి ఉపాధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ స్వగృహానికి వెళ్లారు. ఎమ్మెల్యే గౌరీ శంకర్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని వైద్య సూచనలు అందించారు. ప్రమాదం అనంతరం ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యుత్ కార్మికుల సమస్యలపై జేఏసీ సమావేశం



**హుస్నాబాద్, నవంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ 132 కెవి సబ్‌స్టేషన్ ప్రాంగణంలో టీవీ ఏఈ జేఏసీ హుస్నాబాద్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ కార్మికుల సమస్యలపై సమావేశం జరిగింది. నాయకులు మాట్లాడుతూ ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని, అన్మాండు కార్మికులను ఆర్టిజన్‌గా గుర్తించాలని, ఇంకా ఆర్టిజన్ కాకుండా మిగిలిపోయిన కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి హుస్నాబాద్ డివిజన్ టీవీ ఏఈ జేఏసీ చైర్మన్ కాశ బోయిన అశోక్, కన్వీనర్ నీలి రాజేందర్, శ్రీధర్, కో-చైర్మన్ బడుగం సురేందర్ రెడ్డి, జరిపోతుల మహేందర్, కో-కన్వీనర్ హరి సందీప్, వేణుగోపాల్ రెడ్డి తదితరులు నాయకత్వం వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకులు పప్పు వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు గొర్ల కుమార్ యాదవ్, తాడెం కుమార్, హరీష్ పాల్గొన్నారు. హుస్నాబాద్ డివిజన్‌కు చెందిన విద్యుత్ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# రైల్వే అండర్ బ్రిడ్జి కోసం మంత్రికి వినతి పత్రం

**నల్గొండ, నవంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నల్గొండ పట్టణంలోని పెద్దబండ గొల్లగూడ రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి మంజూరు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కి అల్లి సుభాష్ యాదవ్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమం లో గొల్లగూడ పెద్దబండ రైతులు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

# అతి త్వరలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ స్టాఫ్ అసోసియేషన్ తో మంత్రి ప్రత్యేక సమావేశం...






**-డిమాండ్ల క్లియరెన్స్ కోసం ఉన్నతాధికారుల తో సమావేశానికి మంత్రి నిర్ణయం...**
**-అతి త్వరలో తేదీ ఖరారు!**
**- అధికారులకు ఆదేశాలు...**
**--సోషల్ వెల్ఫేర్ స్టాఫ్ అసోసియేషన్ కు మంత్రి హామీ..**
**-బంజారాహిల్స్ లోని మినిస్టర్స్ క్వార్టర్స్ లో సోషల్ వెల్ఫేర్ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ నేతృత్వంలో మంత్రిని కలిసిన రాష్ట్ర కార్యవర్గం...**



**బంజారాహిల్స్, నవంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మంత్రి లక్ష్మణ్ తో టీజీ కులాల అభివృద్ధి శాఖ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ కార్యవర్గం జరిపిన సమావేశం ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగింది. స్టాఫ్ అసోసియేషన్ ప్రస్తావించిన పలు డిమాండ్లకు మంత్రి అడ్లూరి సానుకూలంగా స్పందించారు. తెలంగాణ ఎస్సిడిడి మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ రిప్రజెంటేషన్ పై చర్చించేందుకు సెక్రటరీ తో సమావేశాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అధికారులను ఆదేశించారు.
అదేవిధంగా తెలంగాణ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మినిస్టీరియల్ స్టాప్ అసోసియేషన్ కార్యవర్గంతో సెక్రటేరియట్ లోని తన చాంబర్ లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న సమస్యలన్నింటిని తక్షణమే పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. డిఎస్ సి డి ఓ మరియు సూపరింటెండెంట్ కేడర్ స్ట్రెంతును తక్షణమే మంజూరు చేయాలని, సూపరింటెండెంట్ లను అడ్మినిస్ట్రేషన్ అధికారిగా గెజిటెడ్ హెూదా కల్పించాలని, ఐ ఎఫ్ ఎం ఐ ఎస్ లో జాక్ట్ ను తొలగిస్తేనే జాక్ట్ లను జూనియర్ అసిస్టెంట్ లుగా మార్చడానికి వీలవుతుందని ఎస్సీ డిడి మినిస్టీరియల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ మంత్రికి వివరించారు.
అదేవిధంగా ఇటీవల ప్రభుత్వం 317 జీవో ప్రభుత్వ ఉద్యోగ బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని కార్యవర్గం విజ్ఞప్తి చేసింది. అదేవిధంగా అర్హత ఉన్న జాక్ట్ లను అందరిని జూనియర్ అసిస్టెంట్ లుగా మార్చే విధంగా తక్షణమే చర్యలు తీసుకోవాలని కార్యవర్గం కోరింది. కొన్ని జిల్లాలలో కేడర్ స్ట్రెంత్ చాలా తక్కువగా ఉండి పని భారం పెరిగి ఉద్యోగస్తులు మానసిక వేదనకు గురవుతున్నారని మంత్రి దృష్టికి తెచ్చారు. ఎస్సీ కార్పొరేషన్ లో అన్ని రకాల కేడర్ ల లో 50% కోటా కింద ఎస్సిడిది సిబ్బందికి అవకాశం కల్పించాలని, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇనిస్ట్యూట్ లో 25% కోటాకు అవకాశం కల్పించాలని, ఇతర క్లిష్ట సమస్యలన్నింటిని తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ఎస్సిడిడి మినిస్టీరియల్ స్టాప్ అసోసియేషన్ కార్యదర్శి యు.ఎ. అరవింద్ కుమార్, ఉమెన్స్ వింగ్ స్టేట్ ప్రెసిడెంట్ శ్రీమతి కె.లత, మహిళా నాయకురాలు కొప్పోలు అనురూప, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి గణపురం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కు విజ్ఞప్తి చేశారు.

# మేడిపల్లి ఎస్సీ కాలనీలో నీటి సమస్య పరిష్కారం

## ధన్యవాదాలు తెలిపిన మడిపెల్లి మల్లేష్



**రామగుండం, నవంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రామగుండం కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి ప్రభావిత గ్రామంలోని ఎస్సీ కాలనీలో గత కొద్ది రోజులుగా త్రాగునీటి పైప్‌లైన్ దెబ్బతినడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. సమస్యను సింగరేణి ఆర్జీవన్ జిఎం లలిత్ కుమార్ మరియు సివిల్ డిపార్ట్మెంట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో గురువారం సింగరేణి సివిల్ విభాగానికి చెందిన ప్లంబర్లు పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టి నీటి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు మడిపెల్లి మల్లేష్ మాట్లాడుతూ, సమస్యను వెంటనే పరిష్కరించిన ఆర్జీవన్ జిఎం లలిత్ కుమార్, సివిల్ డిపార్ట్మెంట్ డీజీఎం వరప్రసాద్, ఎం.ఓ.సి.పి మేనేజర్ మల్లికార్జున్ యాదవ్, ఏఇ చందుపట్ల వెంకటేష్‌కు మేడిపల్లి ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సోషల్ మీడియా ఇన్‌చార్జి గుర్రాల మల్లేష్ యాదవ్, రావికంటి నాగరాజు పాల్గొన్నారు.

# వరంగల్ పశ్చిమలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**వరంగల్, నవంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఈ రోజు 11వ డివిజన్ మున్నూరుకాపు వాడలో రూ.90 లక్షలతో, 53వ డివిజన్‌లో రూ.50 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా పెరుగుదలతో పాటు స్థానిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి కాలనీలో సమగ్ర అభివృద్ధి జరగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డివిజన్లలో పనులు దశలవారీగా పూర్తి చేస్తామని, ప్రజలకు మంచి మౌలిక వసతులు అందించడం తమ బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ల ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కవంపల్లి




**మానకొండూరు,నవంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వీరాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి పథకం కింద నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులు గురువారం అట్టహాసంగా గృహప్రవేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరాపూర్‌ను పైలట్ గ్రామంగా ఎంపిక చేసి, సొంత ఇల్లు లేని నిరుపేదలకు వందశాతం గృహాలు మంజూరు చేశామని తెలిపారు. ప్రస్తుతం నలుగురు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు చేసుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు. లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, నూతన గృహాల్లో సుఖశాంతులతో ఆనందకరమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు. అదనంగా బెజ్జంకి మండలానికి 21వ విడుతలో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, పార్టీ నాయకులు బైర సంతోష్, పులి సంతోష్, గూడెల్లి శ్రీకాంత్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

# సొంతూరుకి వెళ్తూ వ్యక్తి అదృశ్యం



**వనస్థలిపురం,నవంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వనస్థలిపురం ప్రాంతంలో ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రిజ్వాన్ (30) తండ్రి: అజీజ్ గత ఏడు సంవత్సరాలుగా వనస్థలిపురం ప్రశాంత్ నగర్‌లోని భువి డిజైన్స్‌లో మగ్గం వర్క్ చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. తేదీ 14.11.2025 న స్వగ్రామమైన ఉత్తర్ ప్రదేశ్‌కి వెళు న్నానని చెబుతూ వనస్థలిపురం నుండి బయలుదేరిన రిజ్వాన్ 19.11.2025 వరకు కూడా అక్కడికి చేరుకోలేదని కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. తెలిసిన చోట్ల అన్వేషించినా ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందిన ఫిర్యాదు మేరకు వనస్థలిపురం పిఎస్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. యువకుడు ఎక్కడకు వెళ్లాడనే విషయంపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# జమ్మికుంటలో రైతు సమస్యలపై ఈటల రాజేందర్ ధ్వజం

**జమ్మికుంట, నవంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జమ్మికుంటలో ఎంపీ ఈటల రాజేందర్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పంటలు చేతికి వచ్చినా కాంటాలు లేకపోవడం, మిల్లుల్లో ధాన్యం దింపుకోకుండా రోజులు గడపడం రైతులకు ఇబ్బందిగా మారిందని పేర్కొన్నారు. క్వింటాల్‌కు ఎనిమిది కేజీల తరుగు తీస్తున్నారని, ఇది రైతులపై దోపిడీ అని అన్నారు. సన్న వడ్లకు ప్రకటించిన రూ.500 బోనస్ ఇంకా అందలేదని, ఈసారి అయినా ప్రతి రైతుకు అందించాలని డిమాండ్ చేశారు.రెండు లక్షల రుణమాఫీ ఇంకా పెండింగ్‌లో ఉందని, వర్షాలు, తుఫానుతో వరి పంటలు నష్టపోయిన రైతులకు ప్రకటించిన రూ.10 వేల పరిహారం వెంటనే ఇవ్వాలని కోరారు. పత్తి కొనుగోళ్లలో నిబంధనలు సడలించాలని, సీసీఐ రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని సౌలభ్యం కల్పించాలని సూచించారు. ఫసల్ భీమా



సకాలంలో చెల్లిస్తే రైతులకు ఇబ్బంది ఉండేదని వ్యాఖ్యానించారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి మెజారిటీ సీట్లు వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వార్డు మెంబర్లు, సర్పంచులు, ఎంపీటీసీ, ఎంపీపీ, జీపీటీసీలలో విజయం సాధించే స్థితి ఉందని తెలిపారు. రెండు మున్సిపాలిటీలలో బూత్ పటిష్టం చేసుకొని గెలుపు సాధిస్తామని, 107 గ్రామ పంచాయితీలలో మెజారిటీ గెలిచే సత్తా తమకే ఉందని అన్నారు. త్వరలోనే నాయకులు, కార్యకర్తలతో వ్యూహాత్మక సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు.హుజూరాబాద్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, తమ అభ్యర్థులను గెలిపిస్తే పనులు చేయించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. గతంలో చేసిన అభివృద్ధి పనులను గుర్తుచేస్తూ, నాలుగు లైన్ల రోడ్లు, సబ్‌స్టేషన్లు, చెక్‌డ్యామ్‌లు, కమలాపూర్‌లో ఎడ్యుకేషన్ హబ్ ప్రజలకు తెలిసిన విషయాలని అన్నారు. ప్రజలను, ధర్మాన్ని, పనిని నమ్ముకున్న వాడినని, 25 ఏళ్లుగా ప్రజల గుండెల్లో నిలిచిన హుజూరాబాద్ గడ్డను ఎప్పటికీ మర్చిపోనని స్పష్టం చేశారు. అబద్ధాలతో బ్రతికే వారికి ప్రజలే బుద్ధి చెప్తారని వ్యాఖ్యానించారు.

# గ్రామ గ్రామాన మత్స్యకార దినోత్సవ వేడుకలకు పిలుపు



**హుస్నాబాద్, నవంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** "ముదిరాజులే మత్స్యకారులు మత్స్యకారులే ముదిరాజులు" అనే నినాదంతో 2014 నవంబర్ 21న ఆవిర్భవించిన తెలంగాణ ముదిరాజ్ మహాసభ రేపటితో 11వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది. ఈ సందర్భంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని, ముదిరాజ్ జెండాలను ఎగురవేయాలని మహాసభ పిలుపునిచ్చింది.హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో జరిగిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు పొన్నబోయిన శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి చొప్పరి శ్రీనివాస్ ముదిరాజ్, నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు పెండ్యాల ఐలయ్య పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ అధ్యక్షుడు పొన్నం మల్లయ్య, అక్కన్నపేట సొసైటీ మండల అధ్యక్షుడు గంగాధర్ రాజయ్య, కాశబోయిన యాదగిరి, పొట్లపల్లి అధ్యక్షుడు బోడ శంకర్, హుస్నాబాద్ కార్యదర్శి రాగుల శీను, కూరగాయల రవి, రాగుల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి పరిరక్షణకు ఐక్య ఉద్యమానికి పిలుపు

**గోదావరిఖని, నవంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** సింగరేణి కొత్త గనులకు అనుమతులు ఇవ్వకుండా, ఉన్న బావులను అమ్మకాలకు పెడుతూ సంస్థ మనుగడను ప్రమాదంలోకి నెడుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై కార్మిక సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు యాజమాన్యం ఉద్యోగులను తొలగించేందుకు నిర్బంధ సర్క్యులర్లు, మస్టర్ల పేరుతో కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తోందని వారు విమర్శించారు.గోదావరిఖని సిరి ఫంక్షన్ హాల్‌లో మాదాసి రామ్మూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎనిమిది కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గతంలో బీఐఎఫ్ఆర్‌లోకి వెళ్లిన సింగరేణి సంస్థను కార్మికులు రేయింబగళ్ళు శ్రమించి, రక్తతర్పణతో లాభాల బాటలో నడిపించారని గుర్తుచేశారు. ఇప్పుడు కొత్త బావులకు అనుమతులు ఇవ్వకుండా, ఉన్న బావులను వేలం పాటల ద్వారా ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.సింగరేణి



మనుగడను కాపాడుకోవాలంటే కార్మికులు, సంఘాలు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బొగ్గు బావుల అమ్మకం సంస్థకు మరణ శాసనం రాసినట్లేనని వారు స్పష్టం చేశారు.ఈనెల 25న గోదావరిఖనిలో మరోసారి సమావేశం నిర్వహించి, డిమాండ్లు రూపొందించి, ఉద్యమ కార్యాచరణ ప్రకటించాలని నిర్ణయం తీసుకున్నారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్టీయూసీని కూడా ఐక్య ఉద్యమంలో భాగస్వాములను చేసేందుకు ప్రయత్నించాలని తీర్మానించారు.ఈ సమావేశంలో మాదాసి రామ్మూర్తి, తుమ్మల రాజిరెడ్డి, జే. సీతారామయ్య, కామేరా గట్టయ్య, మని రాంసింగ్, కే. విశ్వనాథ్, పోచమల్లు, మహేందర్‌తో పాటు జేఏసీ నాయకులు ఐ. కృష్ణ, రాజమౌళి, నీరటి రాజయ్య, జీ. రాములు, నిమ్మకాయల ఏడుకొండలు, ఈ. నరేష్, దామోదర్ రెడ్డి, వెంకటస్వామి, కొండి శ్రీనివాస్, కుమారస్వామి, రత్న కుమార్, ఐ. రాజేశం, డి. లక్ష్మణ్, ఏ. సంజీవ్, ఎం.ఏ. బేగ్, రాయపోచం, బి. రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మికుల హక్కులు విస్మరించిన ప్రభుత్వం


## -సూర్యాపేటలో బహిరంగ సభకు పిలుపు



**హుస్నాబాద్, నవంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కాంగ్రెస్ ప్రభుత్వం గీత కార్మికులకు ఇచ్చిన హామీలు విఫలమయ్యాయని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రవీందర్ గౌడ్ విమర్శించారు. ఈనెల 28న సూర్యాపేట జిల్లా కేంద్రంలో సంఘం అధ్యక్షుడు ఎం.వి. రమణ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ప్రకటించారు.దీనిలో భాగంగా హుస్నాబాద్ పట్టణం, పందిళ్ళ, పొట్లపల్లి గ్రామాల్లో "గీతన్నల రణభేరి" కార్యక్రమం కింద గోడ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. రెండు సంవత్సరాల క్రితం తాడిచెట్టు పైనుండి కిందపడి మరణించిన గీత కార్మికులకు, వికలాంగులైన వారికి ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఎక్స్‌గ్రేషియా చెల్లించలేదని, అర్హులైన వారికి కొత్త పెన్షన్లు మంజూరు కాలేదని, పాత పెన్షన్ల పెంపు జరగలేదని ఆయన పేర్కొన్నారు.రాష్ట్రంలో బెల్ట్ షాపులు రద్దు చేస్తామన్న హామీ నెరవేరలేదని, మద్యం ఏరులై పాడడం వల్ల కల్లుగీత వృత్తి మనుగడ కోల్పోయే ప్రమాదంలో ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సేఫ్టీ మోకులు పూర్తిస్థాయిలో అందించడం లేదని, అనేక సమస్యలతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పూదరి రాజు, మొలంగూరు శ్రీనివాస్, పచ్చిమట్ల శ్రీనివాస్, వడ్లకొండ శ్రీనివాస్, పూదరి మల్లేశం, బైరి మహేందర్, పొట్లపల్లి మాజీ ఉపసర్పంచ్ శ్యాంసుందర్ గౌడ్, బొమ్మగాని రవీందర్, పొట్లపల్లి గీత కార్మికులు పాల్గొన్నారు.

# సింగరేణి హాజరు శాతం తగ్గుదలపై ఏఐటియుసి ఆగ్రహం


**గోదావరిఖని, నవంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** సింగరేణి సంస్థలో నలభై శాతం మంది కార్మికులు విధులకు హాజరు కావడం లేదని యాజమాన్యం పేర్కొంది. హాజరు శాతం తగ్గిపోవడంతో యంత్రాలు ఖాళీగా ఉండి బొగ్గు ఉత్పత్తి ప్రభావితమవుతుందని, దీనిని నియంత్రించేందుకు నూట యాభై మస్టర్ల సర్క్యులర్ జారీ చేసినట్లు వెల్లడించింది.జిడికె 2వ ఇంక్లైన్‌లో జరిగిన గేట్ మీటింగ్‌లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ, విధులకు రెగ్యులర్‌గా హాజరయ్యే వారికి మినహాయింపు ఇవ్వాలని యాజమాన్యానికి సూచించినట్లు తెలిపారు. అయితే సర్క్యులర్ వల్ల రెగ్యులర్‌గా విధులు నిర్వహించే వారిని కూడా నెలలో 16/20 మస్టర్లు చేయలేదని, కుటుంబ సభ్యులతో కలిసి కౌన్సిలింగ్‌కు రావాలని నోటీసు బోర్డులో పేర్కొనడం కార్మికుల్లో ఆందోళన కలిగించిందని అన్నారు. దీనిని ఏఐటియుసి తీవ్రంగా వ్యతిరేకించడంతో యాజమాన్యం కౌన్సిలింగ్ విధానం రద్దు చేయడానికి అంగీకరించిందని ఆయన వెల్లడించారు.సొంత ఇంటి పథకం అమలు కోసం ఏఐటియుసి 2009లోనే యాజమాన్యంతో చర్చించి సర్క్యులర్ జారీ చేయించినప్పటికీ, ఆ సమయంలో కార్మికులు ముందుకు రాకపోవడంతో అమలు జరగలేదని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం కొన్ని సంఘాలు ఏఐటియుసి పై విమర్శలు చేస్తూ కార్మికులను



తప్పుదోవ పట్టిస్తున్నాయని, దీని వల్ల ప్రయోజనం లేదని అన్నారు. ఇప్పటికే యాజమాన్యం కమిటీ వేసిందని, ఆ రిపోర్ట్ ఆధారంగా సొంత ఇంటి పథకం అమలు చేయనున్నట్లు తెలిపారు.అదనంగా కార్మికులకు మెరుగైన వైద్యం అందించేందుకు హైదరాబాద్‌లో కార్పొరేట్ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసినట్లు, జనవరిలో దానిని ఏర్పాటు చేసేందుకు యాజమాన్యం ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే ప్రమోషన్లు, ఖాళీ పోస్టుల భర్తీ, సంక్షేమ పథకాల అమలు, విజిలెన్స్ కేసుల పరిష్కారం, డిస్మిస్ అయిన కార్మికులకు మరో అవకాశం ఇవ్వడం వంటి అంశాలపై ఏఐటియుసి నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.ఈ సమావేశంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, నాయకులు అక్బర్ అలీ, రంగు శ్రీను, మిట్ట శంకర్, సిర్ర మల్లికార్జున్, పొన్నాల వెంకటయ్య, పెద్దెల్లి శంకర్, పి. రవి, అజీం పాషా, పర్లపెల్లి రామస్వామి, సదానందం, సానా జలపతి, అఫ్రోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# శాతవాహన విశ్వవిద్యాలయం

## - మూడో సెమిస్టర్ పరీక్ష రుసుము గడువు విడుదల




**కరీంనగర్, నవంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని అనుబంధ కళాశాలలకు చెందిన ఎంఏ, ఎంఎస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎం.కామ్ (సి.ఏ), ఎం.కామ్ (బ్యాంకింగ్ అండ్ ఇన్సూరెన్స్), ఎం.కామ్ (సి.ఏ అండ్ ఎఫ్.ఏ) కోర్సుల మూడవ సెమిస్టర్ పరీక్ష రుసుము గడువును విశ్వవిద్యాలయం విడుదల చేసింది.డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. పరీక్ష రుసుము నవంబర్ 29, 2025లోపు చెల్లించవలసి ఉంటుంది. ఆలస్యంగా చెల్లించే వారికి రూ.300 అపరాధ రుసుముతో డిసెంబర్ 3, 2025 వరకు అనుమతించనున్నట్లు పేర్కొన్నారు.ఇతర వివరాల కోసం విద్యార్థులు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌ను సందర్శించవలసిందిగా లేదా ఆయా కళాశాలలను సంప్రదించవలసిందిగా శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డి. సురేష్ కుమార్ సూచించారు.

## పెద్దపల్లిలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్



**పెద్దపల్లి, నవంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి పట్టణ కేంద్రంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే విజయ రమణ రావును క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్‌కు కూడా వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మరాఠ సింహం ఛత్రపతి శివాజీ మహారాజ్ మత సామరస్యాలకు అతీతంగా భారతీయులను ఒకే తాటిపైకి తెచ్చిన మహావీరుడని, తన రాజ్యం, ప్రజల కోసం నిరంతరం కృషి చేసిన ధీరుడని, నీతి, న్యాయానికి కట్టుబడి ఉన్న సేవకుడని పేర్కొన్నారు. త్యాగానికి వెనుకాడని వీరుడు, అమ్మ మాట జవదాటని మహానుభావుడైన శివాజీ మహారాజ్ సిద్ధాంతాలు నేటికీ భారతీయులను ప్రేరేపిస్తున్నాయని అన్నారు. అలాంటి మహావీరుని విగ్రహాన్ని పెద్దపల్లి పట్టణంలో ఏర్పాటు చేయడం ద్వారా యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని మంచి మార్గంలో నడుస్తారని, అందుకే విగ్రహావిష్కరణకు తగిన ఏర్పాట్లు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో శిలారపు పర్వతాలు, తంగెడ రాజేశ్వర రావు, పోల్సాని సంపత్ రావు, వేల్పుల రమేష్, పెంజర్ల రాకేష్, మేకల శ్రీనివాస్, వొల్లే తిరుపతి, కావేటి రాజగోపాల్, ఈర్ల శంకర్, ఎర్రోళ్ల శ్రీకాంత్, వేల్పుల రాజన్న పటేల్, ఉప్పు కిరణ్, మహంత కృష్ణ, గుడ్ల సతీష్, ముంజ రాజేంద్రప్రసాద్, పడాల శ్రీనివాస్, గడాసి సతీష్, శిలారపు మహేష్, బండి రాజశేఖర్, కుక్క అంజి, ఆనంద్ రావు, సంపత్ చారి, మొసంపల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ, కాంగ్రెస్‌పై ఆకుల స్వామి వివేక్ పటేల్ ఫైర్



**పెద్దపల్లి, నవంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై చార్జిషీట్ దాఖలు చేయడానికి రాష్ట్ర గవర్నర్ ఏసీబీకి అనుమతి ఇవ్వడంపై బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేషనల్ కోఆర్డినేటర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ తీవ్రంగా స్పందించారు. నేనుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీకి ఇతరులపై కేసులు పెట్టడం తప్ప మరో పని లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ఈ వైఫల్యం కారణంగా బస్తీల్లో ప్రజల ముఖం చూసే ధైర్యం కూడా కాంగ్రెస్ నేతలకు లేదని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థలలో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయకుండా సర్పంచ్ ఎన్నికలకు వెళ్లడం ప్రజల దృష్టిని మరల్చే కుట్ర అని ఆయన ఆరోపించారు. రిజర్వేషన్ల బిల్లు పై గవర్నర్ సంతకం పెట్టకుండా, అదే సమయంలో కేటీఆర్‌పై విచారణకు అనుమతి ఇవ్వడం ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నమని పేర్కొన్నారు. దేశంలో ప్రస్తుతం కుట్రపూరిత రాజకీయాలు నడుస్తున్నాయని, తెలంగాణలో అనేక ఉదాహరణలు ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. అయితే ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, దేశంలో చట్టం, న్యాయం ఉన్నాయని గుర్తుచేశారు. ఈ రాజకీయ కుట్రలను ప్రజలు తిప్పికొడతారని ఆకుల స్వామి వివేక్ పటేల్ ధీమా వ్యక్తం చేశారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన సుడా చైర్మన్



**కరీంనగర్, నవంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వివిధ అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న అర్హులైన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో 18 మందికి కలిపి రూ.6 లక్షల 70 వేల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరీంనగర్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 846 మందికి నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ ద్వారా సిఎంఆర్ఎఫ్ సహాయం అందించామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలన్నదే తమ ఆకాంక్ష అని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. లబ్ధిదారులలో జుట్టు లక్ష్మీనారాయణ, దారం స్రవంతి, దర్యపల్లి వాణి, పురుమల్ల శ్రీలత, ముజీబున్నీసా బేగం, యాసమీన్ ఫాదౌస్, గుర్రం సురేష్, యెన్నం మహిపాల్, సైద్ సుమర్, మహంకాళి ప్రసాద్, అహ్మద్ అలీ, భూలక్ష్మి, రాజేంద్ర ప్రసాద్, మాచర్ల శేఖర్, సుతారి మల్లేశం, సయ్యద్ మస్తాన్, గుంటి మల్లయ్య, కిష్టయ్య ఉన్నారు.

# పిల్లల హక్కుల పరిరక్షణకు అందరం కృషి చేద్దాం

**హుస్నాబాద్, నవంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కోహెడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా బాలల హక్కుల ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షుడు, ప్రముఖ సామాజికవేత్త వలస సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ బాల కార్మిక చట్టాలు, బాలల హక్కుల చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. పిల్లలు తమ హక్కులను తెలుసుకోవాలని, వాటి పరిరక్షణ కోసం అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. నేటి బాలలే రేపటి భారత పౌరులని ఆయన పేర్కొన్నారు. బాలలతో పనులు చేయిస్తే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1098కు సమాచారం అందించాలని సూచించారు. చిన్నారుల కోసం స్వచ్ఛమైన వాతావరణం, సంపూర్ణ ఆరోగ్యం కల్పించేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని,




విద్యను అందించేందుకు ప్రోత్సహించాలని ఆయన అన్నారు. బాలల హక్కుల ప్రజావేదిక గత రెండు దశాబ్దాలుగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నిర్మూలన కోసం తెలంగాణ వ్యాప్తంగా నిరంతర కృషి చేస్తోందని తెలిపారు. తెలంగాణను బాల కార్మిక రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వ పాఠశాలలకు అధిక నిధులు కేటాయించాలని, చిన్నారులు పట్టుదలతో విద్యపై దృష్టి పెట్టి విజ్ఞానాన్ని పెంచుకోవాలని, మహనీయుల పుస్తకాలను చదవాలని సూచించారు. చిన్నారులు తల్లిదండ్రుల కోసం కలం నిజం చేసేందుకు లక్ష్యాన్ని ఏర్పరచుకుని నిరంతరంగా శ్రమించాలని ఆయన పిలుపునిచ్చారు. నవంబర్ నెల బాలలకు పండుగలాంటిదని, ప్రపంచ బాలల హక్కుల దినోత్సవ వేడుకలను చిన్నారులతో కలిసి జరుపుకోవడం ఆనందకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ మహిమూద్, మాజీ విద్యా కమిటీ చైర్మన్ గాజుల వెంకటేశ్వర్లు, బాలల హక్కుల ప్రజావేదిక ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బైరి చంద్రశేఖర్, చిన్నారి బాలబాలికలు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు వామపక్షాల ఐక్యత అవసరం

**చాడ వెంకటరెడ్డి**



**హుస్నాబాద్, నవంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చిగురుమామిడి మండల కేంద్రంలోని సిపిఐ మండల సమితి కార్యాలయం ముస్కురాజిరెడ్డి స్మారక భవన్‌లో గురువారం విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్కౌంటర్‌ల పేరుతో మావోయిస్టులను హతం చేయడం దుర్మార్గమని, ప్రజల హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలని అన్నారు. దేశంలో గతంలో భూస్వాములు, పెత్తందారుల ఆధిపత్యం కొనసాగితే, నేడు ప్రజాస్వామ్య ముసుగులో కార్పొరేట్ శక్తులు పాలనను ప్రభావితం చేస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్ల ప్రజలకు మాట్లాడే స్వేచ్ఛ, ప్రశ్నించే హక్కులు లభించాయని, కానీ నేటి పాలకులు వాటిని నిరాకరిస్తున్నారని విమర్శించారు. ఛత్తీస్గఢ్‌లో ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను హతం చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, ఇలాంటి చర్యలు నియంతృత్వ ఫ్యూడల్ వ్యవస్థ పునరావృతానికి దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఆయన ఎండగట్టారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ, బిల్లు గవర్నర్, రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉండడం ఎన్నికల నిర్వహణకు అడ్డంకిగా మారిందని అన్నారు. రిజర్వేషన్ల పెంపుపై కేంద్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఏకమైతేనే సాధ్యమని, బిజెపి స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ తప్పనిసరిగా పోటీ చేస్తుందని, ప్రజల మధ్య ఉండి ప్రజల కోసం పనిచేసే పార్టీగా తమ శ్రేణులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్‌తో మిత్రపక్షంగా కొనసాగుతున్నామని, అవసరమైతే చర్చిస్తామని అన్నారు. సిపిఐ వందేళ్ల ఉత్సవాలు దేశవ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయని, తెలంగాణలో డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే బహిరంగ సభ విజయవంతం కోసం రాష్ట్రవ్యాప్తంగా మూడు ప్రచార జాతాలు నిర్వహిస్తున్నామని, జోడేఘాట్‌లో ప్రారంభమైన జాత ఈ నెల 21న భద్రాచలంలో ముగుస్తుందని చాడ వెంకటరెడ్డి వివరించారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, జిల్లా కౌన్సిల్ సభ్యులు అందె చిన్న స్వామి, చాడ శ్రీధర్ రెడ్డి, బోయిని సర్దార్ వల్లభాయ్ పటేల్, మావురపు రాజు, తేరాల సత్యనారాయణ, బూడిద సదాశివ, పైడిపెల్లి వెంకటేష్, ముద్రకోల రాజయ్య, గోలీ బాపు రెడ్డి, మహిళా సమాఖ్య నాయకురాలు రాకం అంజవ్వ తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్, నవంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం జరిగిన బాలల దినోత్సవ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలల సంరక్షణ చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని సూచించారు. స్నేహితా కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బాల బాలికలు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ధైర్యంగా 1098 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని, పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పెట్టెలలో ఫిర్యాదులు వేయాలని సూచించారు. బాలలపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయి మాట్లాడుతూ బాల్యవివాహాలను నివారించాలని, ఎక్కడైనా జరుగుతున్నట్లయితే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. అలాగే మత్తు పదార్థాల వినియోగం, అమ్మకం గురించి సమాచారం ఉంటే నిర్భయంగా తెలియజేయాలని అన్నారు. తదుపరి బాలల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలు, చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్లలో నిర్వహించిన పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సైన్ లాంగ్వేజీలో జాతీయ గేయం పాడిన వారిని, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించిన ప్రభుత్వ క్రీడా పాఠశాల విద్యార్థులను అభినందించారు. పిల్లల దత్తతకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యూసి చైర్‌పర్సన్ ధనలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గంగాధర్, మండల విద్యాధికారి ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లిలో గ్రంథాలయ నూతన భవనానికి శంకుస్థాపన



**పెద్దపల్లి, నవంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి జిల్లా కేంద్రంలో గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి గురువారం శంకుస్థాపన జరిగింది. డి.ఎం.ఎఫ్.టి నిధుల ద్వారా రూ.1 కోటి 50 లక్షలతో ఈ భవనం నిర్మాణం చేపట్టబడుతుందని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. తదుపరి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ అన్నయ్య గౌడ్, ఎమ్మెల్యే విజయరమణ రావును శాలువాతో సన్మానించి, నిప్పుల వాగు గ్రంథాన్ని బహుకరించారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ప్రభుత్వం గ్రంథాలయాలను పూర్తిగా విస్మరించిందని, పెరుగుతున్న పట్టణ జనాభాను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆర్ అండ్ బి అధికారులతో చర్చించి 12 గుంటల స్థలాన్ని కేటాయించి, నిధులు మంజూరు చేయించామని, ఏడాది లోపు భవనం నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, ఎంఈఓ సురేందర్ కుమార్, మాజీ కౌన్సిలర్లు, గ్రంథాలయ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతిభకు పట్టం కట్టిన అల్ఫోర్స్ టైనీ టాట్స్ ఇంటెలిజెన్స్



**కరీంనగర్, నవంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రాంగణంలో అల్ఫోర్స్ ఇంటెలిజెన్స్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు తరగతి గదిలోని విషయాలను సృజనాత్మకంగా, ప్రయోగాత్మకంగా బోధిస్తే వారికి పట్టు వస్తుందని, పోటీ పరీక్షల్లో ప్రాతినిధ్యం వహించే స్థాయికి చేరుకుంటారని పేర్కొన్నారు. దేశంలోని సాంకేతిక రంగం ఎన్నో విజయాలు సాధిస్తోందని, కొత్త ఆవిష్కరణలకు వేదిక అవుతోందని హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించేందుకు పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రదర్శనలో భాగంగా విద్యార్థులు గ్రామర్ సిటీ, ఆదర్శనీయ కథలు, మ్యాథ్స్ మానియా, ఆరోగ్యకరమైన ఆహారం జంక్ ఫుడ్, వాటర్ సైకిల్, వంట విధానాలు, అగ్నిపర్వతాల ప్రభావం, గ్రహణం, సునామి, దేశ విద్యా విధానాలు, అభివృద్ధి ఎదుర్కొంటున్న సమస్యలు వంటి అంశాలను ప్రదర్శించారు. ఈ సమాచార పట్టికలు విద్యార్థుల ఆలోచనలను ప్రేరేపించాయి. విద్యార్థుల దాగిన ప్రతిభను వెలికి తీస్తున్న యజమాన్యానికి తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గీత వృత్తిదారుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర సదస్సుకు పిలుపు



**కరీంనగర్, నవంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది గౌడ కులానికి చెందిన ప్రజలు కల్లుగీత వృత్తిలో జీవిస్తున్నారని, వారి సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22న హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ గీత పనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి న్యాలపట్ల రాజు గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వం గీత కార్మికుల కోసం ఇచ్చిన జీవోలు కాగితాలకే పరిమితమవుతున్నాయని, పన్నులు రద్దు చేసినా నిధులు కేటాయించకపోవడంతో సొసైటీలు నిర్వీర్యం అవుతున్నాయని ఆయన విమర్శించారు. జీవో 560ను ప్రభుత్వాలు చిత్తు కాగితంలా చూస్తున్నాయని ఆరోపించారు. గీత కార్మికులకు చెల్లించవలసిన రూ.13 కోట్లకు పైగా సాక్షన్ అయిన నిధులు విడుదల చేయకపోవడం వల్ల చెట్లపై నుండి పడి మరణించిన కుటుంబాలు, గాయపడిన వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే ఆ నిధులను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సేఫ్టీ కిట్స్ కొంతమందికే అందాయని, అర్హులైన అందరికీ ఇవ్వాలని కోరారు. గీత వృత్తిదారులకు పెన్షన్‌ను రూ.5000కు పెంచాలని, గుర్తింపు కార్డులు, సేఫ్టీ కిట్స్, మోటార్ సైకిళ్లు అందించాలని, జీవో 560 ప్రకారం చెట్ల పెంపకానికి 10 ఎకరాల భూమి, కల్లు దుకాణాల నిర్మాణానికి భూమి కేటాయించి ఆర్థిక సహాయం అందించాలని ఆయన సూచించారు. స్కిల్ యూనివర్సిటీలో వృత్తిదారులకు శిక్షణ, పరిశోధన, మార్కెటింగ్ కోర్సులు ప్రవేశపెట్టాలని, రాష్ట్ర గీత పారిశ్రామిక ఆర్థిక సహకార కార్పొరేషన్‌కు నిధులు ఇచ్చి ఎన్నికలు జరపాలని, వృత్తిని ఆధునీకరణ పరిశ్రమగా అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. వృత్తిలో మరణించిన కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియో, శాశ్వత అంగవైకల్యం చెందిన వారికి అదే విధంగా, తాత్కాలిక గాయాలైన వారికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యలు తక్షణమే పరిష్కరించకుంటే సదస్సులో భవిష్యత్తు కార్యక్రమాన్ని రూపొందించి హక్కుల సాధనకు ముందుకు సాగుతామని, అందుకు గీత కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కొయ్యడ సృజన్ కుమార్ గౌడ్, పైడిపల్లి రాజు గౌడ్, నల్లగొండ శ్రీనివాస్ గౌడ్, బుర్ర సతీష్ గౌడ్, బుర్ర చంద్రశేఖర్ గౌడ్, గట్టు కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల సజావు నిర్వహణకు అధికారులు సిద్ధంగా ఉండాలి

**రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్**




**పెద్దపల్లి, నవంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** గ్రామ పంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ. రాణి కుముదిని సూచించారు. జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష చేశారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, డిసిపి కరుణాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం త్వరలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నందున జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మూడు విడతల్లో ఎన్నికలు జరగనున్నందున ప్రతి విడతలో ఏ మండలాల్లో ఎన్నికలు జరగాలో జిల్లా వారీగా ప్రణాళిక అందించాలని అన్నారు. పాత పద్ధతిలో రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని, సెప్టెంబర్ 2న విడుదలైన తుది ఓటర్ జాబితా సంబంధించి వచ్చిన ఫిర్యాదులు, అభ్యంతరాలను నవంబర్ 22లోపు పరిష్కరించాలని తెలిపారు. నవంబర్ 23న ప్రతి గ్రామ పంచాయతీకి పోలింగ్ కేంద్రాలు, ఫోటోలతో కూడిన ఓటర్ జాబితా ప్రచురణ పూర్తి కావాలని ఆదేశించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత ఎంసిసి నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాలని, ఉల్లంఘనలపై వచ్చే ప్రతి ఫిర్యాదును పరిష్కరించేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని కమీషనర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ నరేందర్, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, ఏసిపిలు రమేష్, కృష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలల టైమ్‌టేబుల్‌లో మార్పులు చేయాలని డిమాండ్

**యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి**



**కరీంనగర్, నవంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్‌లోని వివిధ యాజమాన్యాల గురుకులాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వైద్య శాంతి కుమారి మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు ఎక్కువసేపు విధినభ్యసించడం వల్ల శారీరక, మానసిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వెంటనే టైమ్‌టేబుల్‌లో మార్పులు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులందరికీ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, భోదనేతర పనుల నుండి మినహాయింపు ఇవ్వాలని సూచించారు. గెస్ట్, పార్ట్‌టైమ్, ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులందరికీ 12 నెలల వేతనం మినిమం టైమ్‌స్కేల్ వర్తింపజేయాలని, పని భారం అధికంగా ఉన్నందున పారిటీ స్కేల్స్ మంజూరు చేయాలని ఆమె కోరారు. మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో నైట్ డ్యూటీలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలనే నిబంధనలను పునఃపరిశీలించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డి.ఎల్.లను వెంటనే విడుదల చేసి, పిఆర్సిని ప్రకటించాలని, సీనియర్ టీచర్లకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. కేజీబీవీలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులందరికీ మినిమం టెన్ స్కేల్ వర్తింపజేయాలని, సమ్మె కాలపు వేతనాన్ని చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ముల్కల కుమార్, ప్రధాన కార్యదర్శి జావిద్, జిల్లా కార్యదర్శి రాజ్యలక్ష్మి, లకన్ బాబు పాల్గొన్నారు.

# పోయిన స్మార్ట్‌ఫోన్‌ను తిరిగి అందజేసిన పోలీసులు



**కరీంనగర్, నవంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రామగుండంకు చెందిన ఆకుల శివకుమార్ అక్టోబర్ 26న ఆరేపల్లిలో తన వన్‌ప్లస్ ఫోన్‌ను పోగొట్టుకున్నారు. ఈ విషయమై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీఐఆర్ టెక్నాలజీ ద్వారా ఆ ఫోన్ హైదరాబాదులో ఉన్నట్లు గుర్తించి రికవరీ చేశారు. గురువారం రూరల్ పిఎస్ ఇన్స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి ఆ ఫోన్‌ను యజమాని శివకుమార్‌కు అప్పగించారు. ఫోన్ రికవరీలో కృషి చేసిన కానిస్టేబుల్ విశ్వతేజను ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి అభినందించారు.

# ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అక్రమాలు

**- రాజ్యాధికార పార్టీ ఆరోపణ**



**పెద్దపల్లి, నవంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం ఇప్పలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో తీవ్ర అక్రమాలు జరుగుతున్నాయని, నిజమైన నిరుపేదలకు ఇళ్లు దక్కడం లేదని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా నాయకుడు ఉమ్మల్ల రాజేందర్ ఆరోపించారు. గురువారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అనర్హులకు మంజూరు చేశారని, దీనిపై కమిటీ సభ్యులను ప్రశ్నిస్తే ఎమ్మెల్యే ఎంపిక చేశారని చెబుతున్నారని, గ్రామ పంచాయతీ సెక్రటరీ, ఎంపీడీవో కూడా బాధ్యతను తప్పించుకుంటున్నారని ఆయన విమర్శించారు. నిరుపేదలను గుర్తించి ఇళ్లు ఇవ్వాల్సిన కమిటీ సభ్యులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిటీ సభ్యులలో అల్లం రాజు, తోకల సురేష్ తమకే ఇళ్లు కేటాయించుకున్నారని ఆయన తీవ్రంగా ఆరోపించారు. నిరుపేదలకు ఇళ్లు ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ, ఆర్థికంగా, వ్యవసాయ భూమి ఉన్నవారికి ఎలా కేటాయిస్తుందని ప్రశ్నించారు. నిజమైన అర్హులను గుర్తించి రీ-సర్వే చేయించి ఇళ్లు మంజూరు అయ్యేలా జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. లేనిపక్షంలో అర్హులైన బాధితులతో కలిసి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

# సోషల్ మీడియాను బాధ్యతగా వాడాలి

**- మంథని ఎస్ఐ రమేష్**




**పెద్దపల్లి, నవంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మంథని పట్టణ ప్రజలు, యువత సామాజిక మాధ్యమాల్లో బాధ్యతారహిత ప్రవర్తనకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని మంథని పోలీస్ స్టేషన్ ఎస్ఐ రమేష్ హెచ్చరించారు. సోషల్ మీడియాలో కొందరు వ్యక్తులు ఇరువర్గాలను రెచ్చగొట్టే విధంగా, విభేదాలు తలెత్తేలా పోస్టులు, కామెంట్లు పెడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇటువంటి చర్యలు ప్రజల ప్రశాంత జీవనానికి, శాంతి భద్రతలకు ప్రమాదకరమని, ఘర్షణలకు దారితీసే అవకాశం ఉందని ఎస్ఐ రమేష్ తెలిపారు. సమాచారం నిజమా కాదా అని ధృవీకరించకుండా పంచుకోవడం, ఇతరులను ప్రేరేపించే వ్యాఖ్యలు చేయడం, ఘర్షణలకు కారణమయ్యే వీడియోలు, ఫోటోలు పోస్ట్ చేయడం చట్టవిరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. సోషల్ మీడియాను బాధ్యతగా ఉపయోగించాలని, ఏవైనా ప్రేరేపించే పోస్టులు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాజంలో శాంతి, సహనం పాటిస్తూ ఒకరికొకరు గౌరవిస్తూ ప్రవర్తించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్ఐ రమేష్ పేర్కొన్నారు.

# జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంపొందించాలి

- కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, నవంబర్ 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగు విస్తీర్ణాన్ని పెంపొందించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. గురువారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యానవన, సహకార శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 2 వేల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 438 ఎకరాల్లో సాగు జరుగుతోందని తెలిపారు. మిగతా లక్ష్యాన్ని సాధించేలా రైతులకు అవగాహన కల్పించి, పంట సాగు చేయ?? ప్రోత్సహించాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా అధిక ఆదాయం లభిస్తుందని, రైతులకు వివరించి ప్రోత్సహించాలని అన్నారు.రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం వరి, పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లిస్తోందని, కొనుగోలు కేంద్రాల్లో తగిన సదుపాయాలు కల్పించి రైతులకు ఇబ్బంది తలెత్తకుండా చూడాలని ఆయన ఆదేశించారు.అనంతరం కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి 6వ జల పురస్కారాలలో భాగంగా మంచిర్యాల జిల్లాకు లభించిన గుర్తింపుతో కలెక్టర్ కుమార్ దీపక్‌ను శాలువాతో సత్కరించారు.


# ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, నవంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ హెచ్చరించారు. గురువారం నస్పూర్ మండలం తాళ్లపల్లి సమీపంలోని గోదావరి నది తీరం వద్ద సాండ్ రీచ్‌ను తహసిల్దార్ సంతోష్‌తో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వినియోగదారుల సౌకర్యార్థం ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసి, ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి నిబంధనల ప్రకారం రవాణా చేస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక అందిస్తుందని, ప్రభుత్వ అభివృద్ధి పనులకు కూడా రీచ్‌ల ద్వారా ఇసుకను సరఫరా చేస్తున్నారని చెప్పారు. అక్రమ రవాణా జరగకుండా అధికారులు పర్యవేక్షించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.తదుపరి హాజీపూర్ మండలం ముల్కల్లా సమీపంలోని ఇసుక రీచ్‌ను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. గుడిపేట, నంనూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించాలని, రైతులకు త్రాగునీరు, నీడ, గోనె సంచులు, తూకం యంత్రాలు, తేమ యంత్రాలు, ప్యాడి క్లీనర్లు వంటి సదుపాయాలు కల్పించాలని ఆయన ఆదేశించారు.

## షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రి సమస్యలపై సీఎం స్పందించాలని జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్



**షాద్‌నగర్, నవంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జాగృతి అధ్యక్షురాలు కవిత గురువారం షాద్‌నగర్ నియోజకవర్గాన్ని పర్యటించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ ఆసుపత్రిని పరిశీలించి, రోగులతో మాట్లాడి, విభాగాల వారీగా పరిస్థితులను తెలుసుకున్నారు.కవిత మాట్లాడుతూ ఆసుపత్రిలో పైకప్పులు పెచ్చులూడిపోవడం, ప్రాథమిక సదుపాయాల కొరత, పరికరాల పనితీరు దెబ్బతినడం బాధాకరమని పేర్కొన్నారు. 28 మంది వైద్యులు ఉండాల్సిన చోట కేవలం 12 మంది మాత్రమే పనిచేస్తున్నారని, తక్కువ సిబ్బందితోనూ సేవలు అందిస్తున్న వైద్య సిబ్బందిని ప్రశంసించారు.గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పూర్తి చేసి ప్రజల వినియోగానికి తీసుకురావాలని ఆమె డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న వైద్యాధికారుల పోస్టులను తక్షణమే భర్తీ చేస్తేనే రోగులకు నాణ్యమైన వైద్యం అందుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.ప్రభుత్వ ఆసుపత్రులకు ఎక్కువగా నిరుపేద ప్రజలే వస్తారని, అలాంటి వారికి ప్రేమతో, కరుణతో సేవలు అందించడం ఎంతో ముఖ్యం అని సూచించారు. గత ప్రభుత్వం నిలిపివేసిన కేసీఆర్ కిట్ పథకం గర్భిణీ స్త్రీలకు ఎంతో ఉపయుక్తమైందని, దానిని తిరిగి పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు.అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ఆసుపత్రి సిబ్బంది సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని కవిత డిమాండ్ చేశారు.ఈ పర్యటనలో స్థానిక నాయకులు, వైద్య అధికారులు, జాగృతి సభ్యులు పాల్గొన్నారు.

# దేశంలోని 80 కోట్ల మంది పేద ప్రజలకు ప్రతినెల 5 కిలోల ఉచిత బియ్యాన్ని కేంద్రం అందజేస్తుంది

ఆహార, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు, ప్రజా పంపిణీ శాఖల మంత్రి :ప్రహ్లాద్ జోషి




**నల్లగొండ ,నవంబర్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
గురువారం అయన నల్గొండ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన భారత ఆహార సంస్థ డివిజనల్ కార్యాలయాన్ని ప్రారంభించారు.ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ కోవిడ్ మహా విపత్తులో ఏ ఒక్కరూ ఆకలితో చనిపోకూడదన్న ఉద్దేశంతో ఆహార భద్రత కింద పేదలందరికి 5 కిలోల చొప్పున 80 కోట్ల మందికి ఉచిత బియ్యం ఇస్తున్నామని ,ఇది 2030 వరకు ఇది కొనసాగించాలని దేశ ప్రధాని నరేంద్ర మోడీ నిర్ణయించినట్లు తెలిపారు. ప్రపంచంలో ఏ దేశంలో ఇంత పెద్ద మొత్తంలో పేదలకు ప్రతినెల 5 కిలోల బియ్యం ఇవ్వటం లేదని అన్నారు. ఆస్ట్రేలియా,జర్మనీ యూరోపియన్ దేశాలలో సైతం ఇలాంటి పద్ధతి లేదని, భారత ప్రజా పంపిణీ వ్యవస్థను చూసి ఇతర దేశాలు ఆశ్చర్యపోతున్నాయని, ప్రపంచంలోనే భారత ఆహార భద్రత పథకం మోడల్ గా తీసుకురావడం జరిగిందని ఆయన వెల్లడించారు. ప్రపంచ బ్యాంకు సైతం ఇటీవల నివేదికలో భారత దేశంలో అత్యంత ఎక్కువ మందికి ఆహార భద్రత కింద ఉచిత ఆహారం పంపిణీ చేస్తున్న విషయాన్ని పేర్కొన్నట్లు వెల్లడించారు.ధాన్యం సేకరణ పై కేంద్ర మంత్రి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వ్యాప్తంగా రెండు కోట్ల 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరిస్తున్నామని, ప్రస్తుతం 915 లక్షల మెట్రిక్ టన్నుల నిలువ సామర్థ్యం దేశంలో ఉందని, తెలంగాణతో కలిపి 2023- 24 సంవత్సరంలో 2.25 లక్షల కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం నేరుగా రైతుల ఖాతాలలో జమ చేసిందని తెలిపారు. ప్రతినెల తెలంగాణకు 1.11 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలను కేటాయిస్తున్నామని, 1 లక్ష మెట్రిక్ టన్నుల బియ్యం, 3370 మెట్రిక్ టన్నుల గోధుమలను కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఆహార భద్రత వ్యవస్థను పటిష్టం చేసేందుకు రేషన్ కార్డులన్నిటిని డిజిటలైట్ చేయడం జరిగిందని తెలిపారు.నల్గొండ జిల్లా ధాన్యం ఉత్పత్తి, ధాన్యం సేకరణలో తెలంగాణ రాష్ట్రంలోనే ప్రముఖ పాత్ర పోషిస్తున్నదని, ప్రస్తుతం నూతనంగా ప్రారంభించిన ఎఫ్ సి ఐ డివిజనల్ కార్యాలయ ఆవరణలో ఉన్న గోదాంలో 62 వేల మెట్రిక్ టన్నుల నిలువ సామర్థ్యం ఉందని, ప్రభుత్వం భూమి ఇస్తే మరో ఎఫ్సిఐ గోదామును నల్గొండ జిల్లాలో ప్రారంభించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. 2014 -15 నుండి తెలంగాణలో ధాన్యం సేకరణను 600% పెంచినట్లు చెప్పారు . ప్రస్తుతం ప్రపంచ దేశాలన్నీ ద్రవ్యోల్బణంతో బాధపడుతున్నాయని, ఇండియాలో కేవలం .25 శాతం మాత్రమే ఉందని, పి యం సూర్య ఘర్ ముక్త్ బిజిలి పథకం కింద 20175 ఇండ్లకు 20 వేల కోట్లరాయితీ తో పథకాన్ని అమలు చేయడం జరిగిందని తెలిపారు. రైతులు వరి వైపే కాకుండా ఆయిల్ సీడ్స్ ,వాణిజ్య పంటలు పండించాలని కోరారు .కోవిడ్ సమయంలో ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి తెలంగాణకు రావాల్సిన సబ్సిడీ 343 కోట్ల రూపాయల బకాయిలను వెంటనే విడుదల చేస్తామని చెప్పారు. అలాగే సిఎంఆర్ డెలివరీకి సంబంధించి 10 సంవత్సరాల నుండి పెండింగ్లో ఉన్న 1400 కోట్ల రూపాయల మంజూరుకు సరైన రికార్డులు సమర్పిస్తే పరిశీలించి వాటిని కూడా మంజూరు చేస్తామని తెలిపారు.రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి 2024- 25 సంవత్సరానికి సంబంధించి బాయిల్డ్ రైస్ లక్ష్యాన్ని పెంచాలని, పదేళ్ల నుండి పెండింగ్లో ఉన్న 1400 కోట్ల రూపాయలను సీఎంఆర్ బకాయిలు చెల్లించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి సబ్సిడీ 343 కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని, 2024- 25 ఖరీఫ్ సీఎంఆర్ డెలివరీ కాలపరిమితిని 60 రోజులు పెంచాలని, 24 -25 సంబంధించి యసంగి 120 రోజులకు పెంచాలని, తెలంగాణకు అదనపు రేక్ ల సౌకర్యాన్ని కల్పించాలని, దీనివల్ల రైసు మూమెంట్ కు సులభం అవుతుందని, 2025- 26 కు సంబంధించి ధాన్యం సేకరణ టార్గెట్ ను 80 లక్షల మెట్రిక్ టన్నుల నుండి పెంచాలని, ప్రస్తుత ఎఫ్సిఐ గోదాంలో లక్ష మెట్రిక్ టన్నుల సామర్థ్యం వరకు పెంచాలని కోరారు.దేశంలో తెలంగాణ ఖరీఫ్లో 150 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించిందని, 80 లక్షల మెట్రిక్ టన్నులు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తున్నదని, ఇదివరకే 29 వేల కోట్ల రూపాయలను ధాన్యం కొనుగోలుపై ఖర్చు చేయడం జరిగిందని ,రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేసేందుకు రాష్ట్రంలో 8800 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, ఆహార భద్రత కింద ప్రతి ఒక్కరికి 6 కిలోల నాణ్యమైన సన్నబియ్యాన్ని ఇస్తున్నామని తెలిపారు.రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ నల్గొండ జిల్లా బత్తాయి పంటకు ప్రసిద్ధి చెందిందని, అందువల్ల జిల్లాలో 2500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన బత్తాయి కోల్డ్ స్టోరేజ్ మంజూరు చేయాలని, ధాన్యానికి సంబంధించి ప్రైవేటు ప్రభుత్వ భాగస్వామ్యంలో లక్ష మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదామును మంజూరు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు . నల్గొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి ,భారత ఆహార సంస్థ ఈ డి వనిత శర్మ మాట్లాడారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, భారత ఆహార సంస్థ జిల్లా మేనేజర్ రాజు, ఎఫ్సిఐ అధికారులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# టిడబ్ల్యూజేఎఫ్ తో బసవపున్నయ్యకు సంబంధం లేదు

- ఫెడరేషన్ నుంచి అతన్ని తొలగించాం
- ఫెడరేషన్ పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు-సోమయ్య




**వనపర్తి,నవంబర్ 20:(నీలగిరి ఎక్స ప్రెస్):**
తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్)తో బసవపున్నయ్య అనే వ్యక్తికి ఎలాంటి సంబంధం లేదని, సంఘ వ్యతిరేక చర్యలకు పాల్పడినందున ఆయనను ఫెడరేషన్ నుంచి తొలగించడం జరిగిందని ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షు, రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ మామిడి సోమయ్య తెలిపారు. ఈనెల 15న హైదరాబాద్ లో జరిగిన రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో దాదాపు 30 జిల్లాల నుంచి 130 మంది రాష్ట్ర ఆఫీస్ బేరర్లు,కార్యవర్గ సభ్యులు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు,రాష్ట్ర కౌన్సిల్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు, సంఘం వ్యవస్థాపక సభ్యులు హాజరయ్యారని, ఈ సమావేశంలో బసవపున్నయ్యను ఫెడరేషన్ నుంచి శాశ్వతంగా తొలగిస్తూ ఏకగ్రీవ తీర్మానం ఆమోదించారని ఆయన తెలిపారు. గురువారం హైదరాబాద్ లోని ఎన్ ఎస్ ఎస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఫెడరేషన్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు, కన్వీనింగ్ కమిటీ కో-కన్వీనర్లు వల్లాల జగన్, బండి విజయ్ కుమార్, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు ఎం. పద్మనాభ రావులతో కలిసి పలు విషయాలను వెల్లడించారు. గత పదేళ్లుగా సంఘానికి వచ్చిన సభ్యత్వ రుసుము ఎంతో చెప్పకుండా, డైరీ, మ్యాగజిన్ ద్వారా వచ్చిన ఆదాయం లెక్కలు చూపకుండా, జిల్లాల మహాసభలు జరపకుండా అడ్డుకుంటూ సంఘాన్ని విచ్చినం చేస్తున్న బసవ పున్నయ్య ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దుచేసి ఆయనను ఫెడరేషన్ నుండి తొలగించినట్లు తెలిపారు. ఇక నుంచి టీడబ్ల్యూజేఎఫ్ కు బసవపున్నయ్యకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఇటీవల రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో ఏకగ్రీవ ఆమోదంతో ఏర్పడిన ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ అనుమతి లేకుండా బసవపున్నయ్య గానీ, ఇతరులు గానీ ఫెడరేషన్ పేరుతో ఎలాంటి కార్యక్రమాలు, కార్యకలాపాలు నిర్వహించరాదని అన్నారు. అంతేకాకుండా రాష్ట్ర కమిటీ రద్దయిందని, మళ్ళీ రాష్ట్ర మహాసభ జరిగేంత వరకు రాష్ట్ర కార్యవర్గం ఉండదని,ఎవరికీ ఎలాంటి పదవులు ఉండవని ఆయన స్పష్టం చేశారు. సంఘం కార్యకలాపాలు అనగా జిల్లా, రాష్ట్ర స్థాయిలో సభ్యత్వ నమోదు, మహాసభలు, ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర కన్వీనింగ్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర కమిటీ రద్దయినప్పటికీ కొందరు తమ పదవులను ఇంకా వాడుకుంటూ, టీడబ్ల్యూజేఎఫ్ పేరుతో కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలుస్తుందని, ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫెడరేషన్ పేరుతో కార్యక్రమాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకునే బాధ్యతలు రాష్ట్ర కన్వీనింగ్ కమిటీకి అప్పగించడం జరిగిందని, అదే విధంగా ఇటీవల పలు జిల్లాల్లో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, వ్యవస్థాపక సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన జిల్లా మహాసభల్లో ఎన్నికైన జిల్లా కమిటీలన్నీ యధావిధిగా కొనసాగుతాయని రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం ప్రకటించిందని మామిడి సోమయ్య తెలిపారు. ఫెడరేషన్ సభ్యులు, ఇతర జర్నలిస్టులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. ఫెడరేషన్ సంఘానికి ఇంకా తానే ప్రధాన కార్యదర్శినంటూ తిరుగుతున్న బసవపున్నయ్య చెప్పే మాయ మాటలు నమ్మి జర్నలిస్టులు మోసపోవద్దని సూచించారు. ఆయన నిర్వహించే కార్యక్రమాలు కేవలం ఆయన పనిచేస్తున్న నవతెలంగాణ పత్రికకు సంబంధించినవి మాత్రమేనని, ఫెడరేషన్ కు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. ఫెడరేషన్ ను కేవలం నవతెలంగాణ పత్రిక జర్నలిస్టులకే పరిమితం చేసి, ఆ పత్రిక ప్లాంట్ యూనియన్ గా మార్చి తన సొంతం చేసుకోవాలని చూస్తున్నారని,ఈ కుట్రలను ఫెడరేషన్ సభ్యులంతా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. సంఘం నుంచి బహిష్కరణకు గురైన బసవపున్నయ్య,పిల్లి రాంచందర్ లు రేపు రాష్ట్రవ్యాపితంగా కలెక్టర్లకు వినతి పత్రాలు ఇచ్చే కార్యక్రమానికి పిలుపు ఇవ్వడం చట్టవిరుద్ధమని అన్నారు. కేవలం తమ ఉనికిని చాటుకునేందుకు బసవపున్నయ్య వేరు కుంపటి పెట్టి సంఘాన్ని విచ్చిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శిచారు. ఆయన చేస్తున్న కార్యక్రమాలకు గానీ, సమావేశాలకు గానీ టీడబ్ల్యూజేఎఫ్ కు సంబంధం లేదని, సంఘం సభ్యులు ఎవరు కూడా ఆయన సొంత కార్యక్రమాలకు వెళ్ళవద్దని మామిడి సోమయ్య కోరారు.